
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





అన్నదాత సుఖీభవ

- 1.98 లక్షల మందికి రైతులకు లబ్ధి
- కౌలు రైతులకూ సుఖీభవ పథకం వర్తింపు
- రూ.396 కోట్లు నిధులు
- మార్పులకు ఈ నెలాఖరు వరకు గడువు
- విడతల వారీగా రైతుల ఖాతాల్లో జమ
- జూన్‌లో మొదటి విడతకు సన్నాహాలు

నంద్యాల, మే 13 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాతలకు పంట సాయం కింద అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు తగిన విధంగా ఆదేశించింది. ఈనెల 20వ తేదీలోపు రైతులతో కూడిన సమగ్ర జాబితాను ఆన్‌లైన్ చేయాలని సూచించింది. అధికార లెక్కల ప్రకారం జిల్లాలో 3.35లక్షల మంది రైతులు ఉండగా.. వారిలో 1.98 లక్షల మంది మాత్రమే అర్హులుగా ఉన్నారు. వీరితో పాటు కౌలు రైతులకు కూడా ఈ అన్నదాత సుఖీభవ పథకం వర్తింపచేస్తున్నట్లు సమాచారం. ఎన్నికలకు ముందు ప్రచారంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే దిశగా ముందుకెళ్తోంది. ఈ పథకంలో భాగంగా రైతులకు కేంద్రం నుంచి రూ.6వేలు, రాష్ట్ర వాటా కింద రూ.14 వేలు రానుంది. అయితే కేంద్రం ఇచ్చే రూ.6వేలను పీఎం కిసాన్ పేరుతో విడతల వారీగా ఇస్తుండగా.. ఇదే తరహాలో రాష్ట్రం ఇచ్చే రూ. 14 వేలను సైతం మూడు విడతలగా రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. మొదటి విడత వచ్చే నెల(జూన్‌లో) రైతులకు జమ చేయనుందని తెలుస్తోంది.

రైతు భరోసా పేరుతో వైసీపీ అన్యాయం

గత వైసీపీ ప్రభుత్వం రైతులను పలు విధాలుగా ఆదుకుంటామని రైతు భరోసా పేరుతో తూట్లు పొడిచింది. కేంద్ర ప్రభుత్వం వాటాతో కలిపి రూ.13,500 ఇచ్చి చేతులు దులుపుకుంది. వీటితో పాటు రైతన్నలను వైసీపీ సర్కార్ పలు రకాలుగా మోసగించింది. రైతులను ఎలాగైనా ఆదుకోవడంతో పాటు అండగా ఉండాలనే లక్ష్యంతో అసెంబ్లీ ఎన్నికలకు ముందు చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలో అన్నదాత సుఖీభవను ప్రధానంగా చేర్చారు. అర్హులైన ప్రతి రైతుకు రూ.20 వేలు అందజేస్తామని ప్రకటించారు. వెంటనే అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ సైతం ఇచ్చిన మాటకు కట్టుబడి ఇటీవల బడ్జెట్‌లో రూ.6,300 కోట్లు కేటాయించడం, పథకం అమలుకు సిద్ధంగా ఉండటంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో పరిస్థితి ఇలా...


- జిల్లాలో రైతుల సంఖ్య : 3.35లక్షలు
- కౌలు రైతుల సంఖ్య : 50 వేలకు పైగానే..
- పీఎం కిసాన్ పథకం లబ్ధిదారులు : 2.51లక్షలు మంది
- పీఎం కిసాన్‌లో అర్హులు : 1.98 మంది
- అన్నదాత సుఖీభవలో అర్హులు : 1.98 లక్షల మంది రైతులు
- వీరితో పాటు 50 వేలమంది దాకా కౌలు రైతులకు సుఖీభవ పథకం వర్తించనుంది.

విడతల వారీగా రైతుల ఖాతాలకు జమ

అన్నదాత సుఖీభవ పథకం ఉత్తర్వుల ప్రకారం.. నంద్యాల, ఆత్మకూరు, డోన్, నందిగొట్కూరు, ఆళ్లగడ్డ, పాణ్యం, బనగానపల్లె నియోజకవర్గాల పరిధిలోని 3.35లక్షల రైతన్నలు ఉండగా.. వీరిలో పీఎం కిసాన్ కింద 1.98 లక్షలమంది రైతులు మాత్రమే అర్హులుగా ఉన్నట్లు గుర్తించారు. ఇదే తరహాలో వీరందరికీ కూడా అన్నదాత సుఖీభవ కింద లబ్ధిచేకూరనుంది. అయితే తాజా ఆదేశాల ప్రకారం.. సదరు నివేదికతో పాటు కొత్తగా మార్పులు, చేర్పులు, మృతి చెందిన రైతులు, వివిధ క్రయవిక్రయాలతో కూడిన రైతులు ఉన్నారనే విషయం ప్రభుత్వం గుర్తించింది. దీంతో 1.98మంది రైతులతో పాటు ఈ కొత్త తరహాలో అర్హులైన రైతులకు లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో సమగ్రంగా అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ అందాలనే ఉద్దేశంతో ఈనెల 20 వరకు క్షేత్రస్థాయిలో అర్హులైన రైతులను గుర్తించేందుకు అవకాశం కల్పించింది.







అర్హుల జాబితాను తయారు చేస్తున్నాం

ఇప్పటికే (ఏపీఎఫ్ఆర్) ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ 70శాతం పూర్తయింది. పీఎం కిసాన్ కింద 1.98 లక్షలమంది రైతులకు లబ్ధి చేకూరుతోంది. ఇదే తరహాలో అన్నదాత సుఖీభవ కింద లబ్ధి కలగనుంది. ఈ నెల ఆఖరిలోపు ఆన్‌లైన్‌లో అర్హులైన రైతుల జాబితాను ప్రభుత్వానికి అందజేస్తాం. కౌలు రైతు లకు అవకాశం కల్పించడంతో ఎంతో ప్రయోజనం. ఈనెల 20వ తేదీలోపు పూర్తిగా జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో మార్పులను పరిశీలన చేసి అర్హుల జాబితాను సిద్ధం చేయడం జరుగుతుంది. ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూస్తాం.

- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో)



డ్రోన్ టెక్నాలజీతో మార్పులు

- రైతులకు ఉపాధి అవకాశాలు
- 80శాతం రాయితీ అందిస్తాం
- కలెక్టర్ రాజకుమారి
- కిసాన్ డ్రోన్స్ వినియోగంపై అవగాహన



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి) : డ్రోన్ టెక్నాలజీతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో వ్యవసాయంలో కిసాన్ డ్రోన్స్ వినియోగంపై సంబంధిత అధికారులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీతో రైతులకు మెరుగైన ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. రోబో కృషి 3ప్రొ అనే డ్రోన్ సుమారు రూ.9.8లక్షలవరకు ఖర్చు అవుతుందని, అందులో 80శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతోందన్నారు. ఆటోమేటిక్ విధానం ద్వారా రైతుల దగ్గర ఉన్న ఎఫ్ఎంబీకాపీలో ఉన్న రేఖాంశం, అక్షాంశాల వివరాలను డ్రోన్‌లో నమోదు చేస్తే మనిషి అవసరం లేకుండా పొలం మొత్తం స్ప్రేచేసే అవకాశం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. డ్రోన్‌కు పొలాల దగ్గర చార్జింగ్ పెట్టుకునే అవకాశంతో పాటు డ్రోన్స్ ట్యాంక్ సామర్థ్యాన్ని పెంచేలా చూడాలని రోబో నిర్వాహకులను కలెక్టర్ కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి, నాబార్డు డీడీఎం, డ్రోన్ సంస్థ నిర్వాహకులు కిసాన్ డ్రోన్స్ సాంకేతిక వినియోగం, ఉపయోగాలు, బ్యాంక్‌రుణం తదితర అంశాలపై వ్యవసాయ అధికారులకు, రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఎల్‌డీఎం రవీందర్‌కుమార్, ఆర్ఆర్ఎస్ ప్రిన్సిపాల్ డా.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గోరుకల్లును పరిశీలించిన సీడీఓ బృందం



గోరుకల్లు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న సెంట్రల్ డిజైన్ ఆర్గనైజింగ్ బృందం

పాణ్యం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గోరుకల్లు రిజర్వాయర్ రాతి పరు పును పునఃనిర్మించాల్సిందేనని నిపుణుల బృందం సూచించింది. మంగళవారం సెంట్రల్ డిజైన్ ఆర్గనైజింగ్(సీడీవో) కమిటీ బృందం రిజర్వాయర్ పనులను పరిశీలించింది. ఈ సందర్భంగా సీడీవో సీఈ విజయభాస్కర్ మాట్లాడుతూ రిజర్వాయర్ పనులు పూర్తికాకముందే రాతిపరుపు కుం గడంపై ప్రత్యేకంగా పరిశీలించామన్నారు. రిజర్వాయర్‌లోని నీటిఒత్తిడితో పాటు రివిట్‌మెంట్ కింద ఖాళీ ఏర్పడడంతో నీరు రివిట్‌మెంట్‌లోకి వెళ్లి కుంగినట్లు తెలిపారు. గోరుకల్లు రిజర్వాయర్ కట్టను, మట్టికట్ట, రాతిపరుపు కుంగిన ప్రదేశాలను పరిశీలించారు. మట్టి నాణ్యతను పరిశీలించారు. నీటి నిల్వ వివరాలు తెలుసుకున్నారు. కట్ట కుంగిన ప్రదేశాల్లో తిరిగి ఎలా పున ర్మించాలో వివరించారు. రిజర్వాయర్ మ్యాపులను పరిశీలించారు. రాతి పరుపు కుంగిన చోట రాళ్లను తొలగించి పునఃనిర్మిస్తే తప్ప మళ్లీ కుంగే పరి స్థితి రాకపోవచ్చని అభిప్రాయపడ్డారు. నిర్మాణ పనులు మధ్యలో ఆగి పోవడంవంతో ప్రధాన సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. మధ్యలో నిలిచి పోవడంతో నీరు కట్టలో చేరుతుండడం ఇబ్బందిగా మారిందన్నారు. కార్యక్రమంలో సీఈ కబీర్, ఎస్ఈ శివకామార్‌రెడ్డి, ఈఈ మనోహర్, డీఈ లు రీనా, శ్రీనివాసరెడ్డి, కేదార్‌నాథ్‌రెడ్డి, ఈఈలు శుభకుమార్ తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల ఉద్యోగులపై
జాతీయ కమిషన్ కార్యదర్శి సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న
షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ కార్యదర్శి జి.శ్రీనివాస్

శ్రీశైలం, మే 13(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో మంగళవారం షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ కార్యదర్శి జి.శ్రీనివాస్ పర్యటించారు. నంద్యాల జిల్లాలో ఉద్యోగ నియామకాలు, పదోన్నతులు, షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లు, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆయన సమీక్షించారు. ఆలయ ఈఓ ఎం. శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశ మందిరంలో ఈ సమీక్షా సమావేశం జరిగింది. శ్రీశైలక్షేత్ర ప్రత్యేకతను, భక్తులకు దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలను ఈఓ వివరించారు. 148 మంది షెడ్యూల్డ్ కులాలకు చెందిన సిబ్బంది దేవస్థానంలో పనిచేస్తున్నారని, అందులో శాశ్వత ఉద్యోగులు 32 మంది, ఒప్పంద సిబ్బంది 50 మంది, పొరుగుసేవల సిబ్బంది 66 మంది ఉన్నట్లు తెలిపారు. అనంతరం షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ కార్యదర్శి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ దేవస్థానంలో ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో అమలుపరుస్తున్న రిజర్వేషన్ విధానాన్ని పరిశీలించారు. చారిత్రక శాసనాలు, తామ్రశాసనాలను, విశేషాలను భక్తులు చూసేందుకు ఓ మ్యూజియంను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. అనంతరం నంద్యాల జిల్లాలో షెడ్యూల్డ్ సామాజికవర్గాల అభివృద్ధికి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలపై జిల్లా అధికారులతో మాట్లాడారు. ఈ సమావేశంలో షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ డైరెక్టర్ జి.సునీల్‌కుమార్ బాబు, నంద్యాల జేసీ సి.విష్ణుచరణ్, ఏఈవో డి.నాగజ్యోతి, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి యం.చింతామణి, దేవస్థానం యూనిట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణ నిధికి
శ్రీమఠం రూ.25 లక్షలు విరాళం

మంత్రా లయం, మే 13 (ఆంధ్రజ్యోతి): భారత వీర జవాన్లు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాటం చేస్తున్న దేశ రక్షణ నిధికి రూ.25లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ప్రకటించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇండో-పాక్ యుద్ధ వాతావరణంలో జవాన్లు వీర మరణం పొందారని గుర్తు చేశారు. పహల్గాం ఉగ్రదాడిలో హిందూ మతానికి చెందిన వారిని అడిగి మరీ దుర్మార్గంగా హత్య చేయడం బాధాకరమన్నారు. పహల్గాం దాడిలో మృతి చెందిన కర్ణాటక వాసులకు ఒక్కొక్కరికి రూ.లక్ష ఇచ్చినట్లు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ప్రభుత్వం దేశ సైన్య త్రిదళాలపతులు వీరోచిత పోరాటం చేసి పాకిస్తాన్‌ను కోలుకోలేనంత దెబ్బతీశారన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ రక్షణ నిధికి రూ.25 లక్షలు అందజేస్తున్నట్లు పీఠాధిపతి తెలిపారు.



మోక్షం లభించేనా..?

తెలుగు రాష్ట్రాల ప్రాణనాడి శ్రీశైలం డ్యాం మరమ్మతులకు మోక్షం లభించనుంది. ప్రాజెక్టు దుస్థితిపై సీరియస్ కావడమే కాకుండా, మరమ్మతులకు అవసరమైన నిధులు అంచనాలు తక్షణమే తయారు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో ఆశలు చిగురిస్తున్నాయి. 2009లో డ్యాంకు పోటెత్తిన వరదలకు ప్రాజెక్టు భారీగా దెబ్బతింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి నిపుణుల కమిటీలు మరమ్మతులు, ప్రమాదకరంగా మారిన ప్లంజ్ పూల్‌పై అధ్యయనం కోసం పలు సూచనలు చేస్తూ నివేదికలు ఇచ్చాయి. ఐదేళ్లలో ప్రాజెక్టు ఇంజనీర్లు దాదాపు 13 సార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గత వైసీపీ హయాంలో నిర్లక్ష్యం శ్రీశైలం డ్యాంకు శాపంగా మారింది. తాజాగా డ్యాంను పరిశీలించిన జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) చైర్మన్ అనిల్ జైన్ డ్యాంను పరిశీలించారు. భద్రత లోపాలపై ప్రభుత్వానికి లేఖ రాశారు. 'ఆర్థిక శాఖతోనే అసలు పేచీ' శీర్షికన ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. సీఎం చంద్రబాబు స్పందించారు. ఎట్టకేలకు మరమ్మతులకు నిధులు వచ్చే అవకాశం ఉందని రైతులు, ఇంజనీర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- 2009 వరదలకు భారీగా దెబ్బతిన్న శ్రీశైలం డ్యాం
- ప్రాజెక్టు భద్రతపై నివేదికలు
- ఐదేళ్లలో 13 సార్లు ప్రతిపాదనలు
- వైసీపీ హయాంలో నిర్లక్ష్యం
- తక్షణ మరమ్మతులకు రూ.34 కోట్లు అవసరం
- సీఎం చంద్రబాబు నాయుడు దృష్టి సారించడంతో ఆశలు


కర్నూలు, మే 13 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాం.. బహుళార్థక సాధక ప్రాజెక్టు. తెలుగు రాష్ట్రాలకు జీవనాడి. ముఖ్యంగా నిత్యం కరువుతో తల్లడిల్లే రాయలసీమ పల్లెసీమలకు ప్రాణదాయిని ఈ ప్రాజెక్టు. శ్రీశైలం దేవస్థానం పాతాళగంగ వద్ద కృష్ణానదిపై 'శ్రీశైలం ప్రాజెక్టు' నిర్మాణానికి 1963 జూలై 24న అప్పటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ పునాది రాయి వేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి 20 ఏళ్లు పట్టింది. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 308.04 టీఎంసీలు. వరద ప్రవాహ సామర్థ్యం (ఫ్లడ్ వాటర్ డిశ్చార్జ్ కెపాసిటీ) 13.20 లక్షల క్యూసెక్కులు. డ్యాం ఏటేటా పూడిక చేరడంతో.. 2011లో వరద లెక్కలు పరిశీలించి గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలుగా నిర్ధారించారు. అంటే 92.24 టీఎంసీలు పూడిక చేరింది. 12 రేడియల్ క్రస్ట్ గేట్లు స్పిల్‌వే నుంచి వరద జలాలు కిందకు పడి మళ్లీ పైకెగిరి నదిలో పడే ప్లంజ్‌పూల్ ప్రాంతంలో ఏర్పడిన భారీ గుంత డ్యాం పునాదులపై ప్రభావం చూపుతుందని నిపుణులు అంటున్నారు. 2009 అక్టోబరులో 25.5 లక్షల క్యూసెక్కుల వరద చేరడంతో ప్రాజెక్టు కూడా దెబ్బతింది. 2014 సెప్టెంబరు 23న ఢిల్లీలో కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ శ్రీశైలం సహా వివిధ ప్రధాన ప్రాజెక్టుల భద్రత, నిర్వహణ లోపాలపై సమీక్షించింది. ఆ సమయంలో శ్రీశైలం డ్యాం భద్రతపై నిపుణులు అనుమానాలు వ్యక్తం చేశారు.



డ్యాంను పరిశీలించిన నిపుణుల కమిటీలు

2014 సెప్టెంబరు 23 తర్వాత పలు నిపుణుల కమిటీలు శ్రీశైలం ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భద్రతాలోపాలు, 2009 వరదలకు దెబ్బతిన్న డ్యాం మరమ్మతులపై పలు సూచనలతో నివేదికలు ఇచ్చారు. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆదేశాల మేరకు 2014 అక్టోబరులో అప్పటి ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు చైర్మన్, కన్వీనర్ మెంబరు కర్నూలు ప్రాజెక్ట్ సీఈ విశ్వేశ్వరరావు, సీడబ్ల్యూసీ హైడ్రాలజీ విభాగం డైరెక్టర్ భూపాల్‌సింగ్, ప్రాజెక్టు డిజైన్ డైరెక్టర్ ఎస్‌కే సిబాల్, ఫౌండేషన్ ఇంజినీరింగ్ డైరెక్టర్ వీఆర్‌కే పిళ్లై, సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ (సీడీఓ) సీఈ గిరిధర్‌రెడ్డి, రిటైర్డ్ సీఈ కేవీ సుబ్బారావు, తెలంగాణ క్వాలిటీ కంట్రోల్ సీఈ ఎం.కృష్ణారావు సభ్యుల కమిటీ 2014 అక్టోబర్ 28న ప్రాజెక్టును తొలిసారిగా పరిశీలించారు. 2017 జూలై 13న కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్ డాక్టర్ వైకే మూర్తి నేతృత్వంలోని నిపుణుల కమిటీ, 2018 జూన్ 11న జలవనరుల శాఖ రిటైర్డ్ ఈఎన్‌సీ పి.రామరాజు, రిటైర్డ్ సీఈ కె.సత్యనారాయణ, రిటైర్డ్ ఈఈ కె.కృష్ణ కమిటీ ఈ ప్రాజెక్టును పరిశీలించి డ్యాం భద్రత, ప్లంజ్‌పూల్ మరమ్మతులకు పలు సూచనలు చేస్తూ నివేదికలు ఇచ్చాయి.

మిగతా 7వ పేజీలో



శ్రీశైలం డ్యాంను పరిశీలిస్తున్న ఎన్‌డీఎస్ఏ బృందం

పర్యాటకం

నంద్యాల జిల్లాలోని బనగానపల్లె నియోజకవర్గ పరిధిలో ఉన్న అనేక ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాంతాలను కలిపి పర్యాటక హబ్‌గా మార్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. మండలంలోని యాగంటి క్షేత్రానికి పర్యాటక ప్రాధాన్యత ఉంది. వివిధ జిల్లాల నుంచి భక్తులు నిత్యం వందలాదిగా వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. అట్లాగే మండలంలోని చౌడేశ్వరీమాత ఆలయంలో జరిగే జ్యోతి ఉత్సవాలకు ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు వస్తుంటారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బెలుం గుహలు, అవుకు రిజర్వాయర్, అక్కడి బోటింగ్ చాలా పర్యాటకులను ఆకట్టుకుంటాయి. యాగంటి సమీపంలోని పాతపాడు గ్రామం వద్ద ఉన్న నవాబుల పాతపాడు బంగ్లాకు చారిత్రక ప్రాధాన్యత ఉంది. నియోజకవర్గంలోని ఇలాంటి ప్రాంతాలన్నిటినీ కలిపి పర్యాటక హబ్ ఏర్పాటు చేసే ప్రయత్నంలో రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఉన్నారు.



పర్యాటకహబ్‌గా బనగానపల్లె

- నియోజకవర్గంలో అనేక ఆలయాలు, పర్యాటక ప్రాంతాలు
- ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి


బనగానపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి) : బనగానపల్లె నియోకవర్గంలో అనేక పుణ్య క్షేత్రాలు ఉన్నాయి. చారిత్రక, పర్యాటక స్థావరాలు ఉన్నాయి. ఈ అనుకూలత అధారంగా పర్యాటక హబ్ ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. యాగంటి క్షేత్రం కర్నూలు నుంచి 87 కిలోమీటర్ల దూరంలో ఉంది. బనగానపల్లె నుంచి యాగంటి వరకు డబుల్ రోడ్డు సౌకర్యం ఉంది. గతంలో పాతపాడు నుంచి యాగంటికి సింగిల్ రోడ్డు ఉండేది. ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేయించి డబుల్ రోడ్డుగా మార్చారు. దీంతో భక్తులు ఇబ్బందులు పడకుండా యాగంటికి చేరుకుంటున్నారు. నంద్యాలనుంచి 55 కిలోమీటర్లు, బనగానపల్లె నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉండే యాగంటికి ఆటోల్లో వెళ్లవచ్చు. ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా ఉంది.

బెలుం గుహలు

నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల మండలంలో విశ్వవిఖ్యాతి గాంచిన బెలుం గుహలు ఉన్నాయి. గుహల అభివృద్ధికి టూరిజం శాఖ ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతం గుహల్లో 27 బ్లోయర్లను ఏర్పాటు చేశారు. 2000లో బెలుం గుహలను అభివృద్ధికి చేసి ప్రారంభించారు. రోజు వివిధ రాష్ట్రాల నుంచి 2వేల మంది యాత్రికులు వీటిని సందర్శిస్తుంటారు. సెలవు రోజుల్లో అధికంగా వస్తుంటారు. గుహల్లో ప్రకృతి సిద్ధమైన శిలాజాలను చూడడానికి వస్తుంటారు. విదేశీయులు కూడా గుహలను సందర్శిస్తుంటారు. గుహల్లో ధ్యానమందిరం, ఊడలమర్రి, పాతాళగంగ, మాయమందిరం, కోటిలింగాలు, యాత్రికులను విశేషంగా ఆకర్షిస్తుంటాయి. ఇక్కడ బుద్ధ విగ్రహం ఉంది. అయితే బెలుం గుహల్లో నాలుగు డార్మెట్రీ గదులు మాత్రమే ఉన్నాయి. బనగానపల్లె నుంచి 35 కిలోమీటర్లు, కర్నూలుకు 110 కిలోమీటర్ల దూరంలో ఈ గుహలు ఉన్నాయి. బనగానపల్లె నుంచి ప్రతి అరగంటకు బస్సు సౌకర్యం ఉంది.



బెలుం గుహల్లోకి వెళ్లే దారి



యాగంటి ఆలయ రాజగోపురం

యాగంటిలో టూరిజం శాఖ ఆధ్వర్యంలో గదులు ఉన్నాయి. అలాగే ప్రైవేటుగా నిర్వహించే బ్రాహ్మణి రెసిడెన్సీలో ఏసీ గదుల సౌకర్యం ఉంది. రూ.కోటి వ్యయంతో కొండలను తొలిచి యాత్రికులు కూర్చోవడానికి, సేదతీరేందుకు దేవదాయశాఖ ప్రణాళికలు రూపొందించింది. నిత్యం వేలాది మంది యాత్రికులు వస్తుంటారు. భక్తులు కూర్చోవడానికి హాల్ సౌకర్యం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. అలాగే వృద్ధులు ఆలయంలోకి వెళ్లడానికి లిఫ్ట్ సౌకర్యం కల్పించడానికి ప్రతిపాదనలు పంపారు.

నందవరం చౌడేశ్వరీమాత ఆలయం

బనగానపల్లె మండలంలోని చౌడేశ్వరీమాత ఆలయం ప్రముఖ శక్తిక్షేత్ర. కాశీవిశాలాక్షిగా అమ్మవారిని భక్తులు కొలుస్తారు. రాష్ట్రం నుంచేగాక తెలంగాణ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు వస్తుంటారు. ఇటీవల నిర్వహించిన జ్యోతి ఉత్సవాల్లో లక్షకు పైగా భక్తులు వచ్చారు. బనగానపల్లె నుంచి పది కిలోమీటర్లు, నంద్యాలనుంచి 32 కిలోమీటర్లు, కర్నూలు నుంచి 80 కిలోమీటర్ల దూరంలో ఈ క్షేత్రం ఉంటుంది. ఈ ఆలయం సమీపంలో అత్యంత పురాతన త్రిలింగేశ్వరస్వామి ఆలయం ఉంది.



నందవరం శ్రీచౌడేశ్వరీమాత ఆలయ రాజగోపురం

బ్రహ్మంగారి మఠం: బనగానపల్లె పట్టణంలో వీరబ్రహ్మేంద్రస్వామి నడయాడిన చింతమానుమఠం, రవ్వలకొండ, అక్కడ ఆయన శివలింగం ప్రతిష్ఠించిన నేలమఠం వంటి ప్రాంతాలు ఉన్నాయి. పక్క రాష్ట్రాల నుంచి పర్యాటకులు ఇక్కడికి విరివిగా వస్తుంటారు.



పాతపాడు బంగ్లా

నవాబు బంగ్లా : బనగానపల్లె పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో పాతపాడు గ్రామం వద్ద నవాబు బంగ్లా ఉంది. వంద సంవత్సరాల క్రితం బనగానపల్లె నవాబుల కాలంలో నిర్మించబడింది. ఇప్పటికీ ఈ కట్టడం చెక్కుచెదరలేదు. ఈ బంగ్లా వద్దనే అరుంధతి సినిమాను తీశారు. అందుకే దీన్ని అరుంధతి బంగ్లా అని అంటారు. ఇక్కడ అనేక సినిమాల షూటింగ్‌లు, సీరియల్స్‌ను తీశారు. యాగంటికి వచ్చే యాత్రికులు తప్పనిసరిగా నవాబు బంగ్లాను సందర్శిస్తుంటారు.



అవుకు రిజర్వాయరు

బనగానపల్లె నియోజకర్గంలో చూడదగ్గది అవుకు రిజర్వాయర్. గతంలో ఇక్కడ బోటింగ్ సౌకర్యం ఉండేది. బోట్ ప్రమాదం జరగడంతో ఈ సౌకర్యం నిలిపివేశారు. అయినా నిత్యం అవుకు రిజర్వాయర్‌ను సందర్శించడానికి అధిక సంఖ్యలో యాత్రికులు వస్తుంటారు. బనగానపల్లె నుంచి 20 కిలోమీటర్లు, కర్నూలు నుంచి 95 కిలోమీటర్లు, నంద్యాల నుంచి 61 కిలోమీటర్ల దూరంలో ఈ రిజర్వాయర్ ఉంటుంది.

బనగానపల్లెను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతాం



బనగానపల్లె నియోజకవర్గంలోని ప్రముఖ ఆలయాలు, బెలుంగుహలు, అవుకు రిజర్వాయర్ తదితర పర్యాటక ప్రాంతాలు ఉండటంతో ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. అట్లాగే ఆలయాలు, బెలుం గుహల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. యాగంటిలో సెంట్రల్ ఏసీ, పార్కింగ్ సౌకర్యం ఇతరత్రా ఏర్పాట్లు చేస్తాం.

- బీసీ జనార్దన్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖా మంత్రి



బెలుంగుహల అందాలు

ఉర్దూ వర్సిటీ డిగ్రీ ఫలితాలు విడుదల



పరీక్షల ఫలితాలను విడుదల చేసిన ఉపకులపతి

కర్నూలు అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఏప్రిల్‌లో జరిగిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాలను ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ పీఎస్ షావలిఖాన్ విడుదల చేశారు. మంగళవారం తన చాంబర్లో రిజిస్ట్రార్ లోక్‌నాథ్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. డిగ్రీ ఎకనామిక్స్, బీకాం, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ జూవాలజీ, 6వ సెమిస్టర్ బీఏ(హెచ్‌ఈపీ)బీకామ్ కంప్యూటర్స్ అప్లికేషన్స్, 8వ సెమిస్టర్ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ బాటనీ, జువాలజీ, పదో సెమిస్టర్ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ బాటనీ, జూవాలజీ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.మహబూబ్ బాషా, పరీక్షల విభాగం కంట్రోలర్ ఎం.నబియా సుల్తానా, వెంకటప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూర్య ప్రతాపం

- కర్నూలు జిల్లా నందవరంలో 43.22 డిగ్రీలు
- నంద్యాల జిల్లా పాణ్యంలో 42.00 డిగ్రీల ఉష్ణోగ్రత
- భిన్న వాతావరణ పరిస్థితులతో అల్లాడుతున్న ప్రజలు



నంద్యాల ఎడ్యుకేషన్, మే 13 (ఆంధ్ర జ్యోతి): సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. రోజురోజుకు ఎండలు ముదురుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున వర్షం, ఉదయం 11గంటల నుంచి ఎండ తీవ్రత ప్రభావం నెలకొంది. భిన్న వాతావరణ పరిస్థితులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం పూట కాస్త చల్లగాలి వీచినప్పటికీ 12గంటల తర్వాత వేడిగాలుల ప్రభావంతో ఇళ్లకే పరిమితమవుతున్నారు. కర్నూలు జిల్లా నందవరంలో 43.22 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కౌతాళం 40.09, వెల్దుర్తి 39.05, కల్లూరు 38.9, కర్నూలు నగరం 38.75, కోడుమూరు 38.09, సి.బెళగల్ 37.90, క్రిష్ణగిరి 37.90 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణసంస్థ వెల్లడించింది.

- నంద్యాల జిల్లాలో పాణ్యంలో 42.00, చాగలమర్రి 41.93, రుద్రవరం 41.02, ఆళ్లగడ్డ 40.44, దొర్నిపాడు 40.42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ సంస్థ వెల్లడించింది.

38.0 ఎం.ఎ వర్షపాతం

కర్నూలు జిల్లా కోడుమూరు మండలం లద్దగిరి 38.0ఎంఎం వర్షపాతం నమోదైంది. కల్లూరు మండలం లక్ష్మీపురం 32.0, వెల్దుర్తి నరసాపురం 29.0, ఎమ్మిగనూరు మండలం సోళ్లకుద్లూరు 21.0, కర్నూలు నగరం 17.75, కర్నూలు మండలం దిన్నెదేవరపాడు 13.5, ఆస్పరి మండలం చిన్న హోతూరు 10.5, ఎమ్మిగనూరు పట్టణం 10.5, గూడూరు మండలం కె.నాగలాపురం 6.5ఎంఎం వర్షపాతం నమోదైంది.

నంద్యాల జిల్లాలో..

కొలిమిగుండ్లలో 37.5ఎంఎం, అవుకు మండలం కొండమాయపల్లెలో 27.5, జూపాడుబంగ్లా 27.5, రామాపురంలో 17.0, నందికొట్కూరు మండలం శాతనకోటలో 12.5, నందికొట్కూరులో 11,5, కొణిదెలలో 10.5, మహానందిలో 9.4 వర్షపాతం నమోదైనట్లు వాతావరణసంస్థ వెల్లడించింది.



దేశభక్తిపై నృత్య రూపకం ప్రదర్శిస్తున్న కళాకారిణులు

దేశ సైనికుల త్యాగాలు చిరస్మరణీయం

జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్

కర్నూలు కల్చరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం సైనికులు చేస్తున్న త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. మంగళవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో మూడు రోజులుగా కొనసాగుతున్న జై జవాన్ కల్చరల్ ఫెస్ట్ కార్యక్రమానికి నాలుగోరోజు ఏర్పాటు చేసిన దేశభక్తి ప్రబోధించే జానపద నృత్యాలు, శాస్త్రీయ నృత్యాల ప్రదర్శనలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత భరతమాత చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కళాకారులు, నిర్వాహకులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ శామ్యూల్ పాల్ మాట్లాడుతూ దేశ రక్షణలో రాయలసీమ ప్రాంత వాసి మురళీనాయక్ వీరమరణం పొందడం ఆయన ధైర్య సాహసాలకు ప్రతీక అన్నారు. అలాంటి వీర జవాన్‌ను దేశానికి అందించిన ఆయన తల్లిదండ్రుల సేవలను ఆయన కొనియాడారు. ఈనెల 16న సాయంత్రం ఐదు గంటలకు కలెక్టరేట్ కార్యాలయం నుంచి టీజీవీ కళాక్షేత్రం వరకు భారత సైనికులకు సంఘీభావంగా భారీ ర్యాలీ ఉంటుందని, ఇందులో జిల్లాలోని వివిధ ప్రాంతాల ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ దేశ సైనికులకు మద్దతుగా ఈనెల 16న సాయంత్రం చేపట్టిన ర్యాలీకి జిల్లాలోని కళాకారులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన, మహిళా సంఘాలవారు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాక్షేత్రం ప్రతినిధులు టి. రాజారత్నం, సంగా ఆంజనేయులు, మహమ్మద్ మియా, యాగంటీశ్వరప్ప, ఇనాయతుల్లా, శ్రీనివాసరెడ్డి, బాలవెంకటేశ్వర్లు, క్రిష్టఫర్, చంద్రకంటి మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు: జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా మంగళవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాట్యాచార్యులు ఎస్ కరీముల్లా, నాగసాయి ప్రదీప్, మల్లేశ్వరి, రోహిత్, నారాయణ స్వామి శిష్యబృందం ప్రదర్శించిన జానపద, శాస్త్రీయ నృత్య రూపకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా బుధవారం సాయంత్రం నుంచి దేశభక్తిని చాటిచెప్పే సినీ సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



కళాకారులతో కలిసి 'జై జవాన్' కల్చరల్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ శామ్యూల్ పాల్



టౌన్ మోడల్

ప్రతిభావంతుల వేదిక

- సరస్వతీ నిలయంగా టౌన్ మోడల్ జూనియర్ కళాశాల
- రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ ఫలితాలే
- ఇక్కడ విద్యను అభ్యసించిన ఎంతో మంది ప్రముఖులు
- దేశవిదేశాల్లో ఉన్నత కొలువుల్లో విద్యార్థులు



కర్నూలు ఎడ్యుకేషన్, మే 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు టౌన్ మోడల్ జూనియర్ కళాశాల ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది. ఇక్కడ చదివిన విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకున్నారు. దేశవిదేశాల్లో ఉన్నత కొలువుల్లో రాణిస్తున్నారు. ఈ సరస్వతీ నిలయంలో చదివిన విద్యార్థులు టీజీ భరత్ రాష్ట్ర మంత్రిగాను, డా.సంజీవ్‌కుమార్, బస్తిపాటి. నాగరాజు ఎంపీలు గానూ, ఇంతియాజ్(ఐఏఎస్), వెంకటరామిరెడ్డి ఐపీఎస్‌లుగాను, డా. చంద్రశేఖర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతిగాను, డా.భానుమతి, డా.శ్రీనివాసులు వివి సీతారామయ్య, ప్రముఖ పారిశ్రామిక వేత్తగా రవీంద్రరెడ్డితో పాటు పలువురు ఈచెట్టు నీడన విద్యను అభ్యసించిన వారే. సరస్వతీ నిలయంగా కర్నూలు టౌన్ మోడల్ జూనియర్ కళాశాల బాసిల్లుతోంది. కర్నూలు టౌన్ మోడల్ జూనియర్ కళాశాలకు ఒక ప్రత్యేకత నెలకొంది. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ఫలితాల సాధిస్తున్నారు.

1971లో కళాశాల ఏర్పాటు

కర్నూలులో 1971 సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థాపించారు. ఈకళాశాలల్లో 1100 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. తెలుగు, ఇంగ్లీషు మీడియంల్లో బోధన కొనసాగుతోంది. జనరల్‌తో పాటు, ఒకేషనల్ కోర్సులు ఉన్నాయి. ఈ కళాశాలలో సీటు కోసం రాజకీయ ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సులు కావల్సిందే. ఈ కళాశాలలో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థులు పోటీపడుతుంటారు.

రాష్ట్రస్థాయిలో అగ్రస్థానం..

కల్లూరుకు చెందిన ఆటో డ్రైవర్ కృష్ణ రెండో కుమార్తె పేరు బండ పావని. కర్నూలు ప్రభుత్వ టౌన్‌మోడల్ జూనియర్ కళాశాలలో చదివి ఇంటర్ ఎంపీసీలో 986 సాధించింది. రాష్ట్రస్థాయిలో అగ్ర స్థానంలో నిలిచింది. అలాగే పి.లలితారాణి 977 మార్కులు తెచ్చుకొని కళాశాల రెండో స్థానంలో నిలిచారు. బైపీసీ విభాగంలో బి.నందిని 980 మార్కులు, రేణు విజయ 978మార్కులు సాధించి కళాశాల,రాష్ట్రస్థాయి టాపర్లుగాను నిలిచారు. 986 మార్కులు సాధించిన పావని సన్‌షైన్ అవార్డుకు ఎంపికైంది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ప్రతి సంవత్సరం కూడా ఈ కళాశాల నుంచి అత్యధిక మార్కులు సాధిస్తూనే ఉన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



కళాశాలల ప్రారంభం నుంచే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతాం. ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ ఏర్పాటుచేస్తాం. రివిజన్ టెస్టులు పెట్టుతాం. ప్రతి అధ్యాపకుడికి 50మంది విద్యార్థులను దత్తత ఇచ్చి, మానిటరింగ్ చేస్తాం. చదువులో వెనకబడిన విద్యార్థులను రిమిడియల్ క్లాస్‌లను చెప్పిస్తాం. తల్లిదండ్రులకు విద్యార్థుల ప్రోగ్రెస్‌ను తెలియజేసి వారిని అప్రమత్తం చేస్తాం. పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత రావడానికి అధ్యాపకుల సమష్టి కృషి ఉంది.

- సుంకన్న, ప్రిన్సిపాల్, టౌన్ మోడల్ జూనియర్ కాలేజీ

మోక్షం లభించేనా..?

(5వ పేజీ తరువాయి)



2020 ఫిబ్రవరి 25న కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్, డ్యాం భద్రతా నిపుణులు ఏబీ పాండ్యా చైర్మన్‌గా కేంద్ర నిపుణుల కమిటీ డ్యాంను పరిశీలించడమే కాకుండా.. వివిధ నిపుణుల కమిటీలు ఇచ్చిన అధ్యయన నివేదికలు స్టడీ చేసి డ్యాం భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేస్తూ 2021లో కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)కు నివేదిక ఇచ్చారు. ఆ తరువాత నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) చైర్మన్ వివేక్ త్రిపాఠి ఆధ్వర్యంలో నిపుణుల బృందం పరిశీలించింది.

వైసీపీ హయాంలో అంతులేని నిర్లక్ష్యం

ప్రాజెక్టు ఆనకట్ట స్పిల్‌వే గేట్ల నుంచి అతివేగంగా కింద పడే వరద మళ్లీ ఎగిరి పడే ప్రాంతం (ప్లంజ్‌పూల్)లో భారీ గుంత ఏర్పడింది. దీని లోతు 45 మీటర్లు, వెడల్పు 270 మీటర్లు, పొడవు 400 మీటర్లు ఉంటుందని అంచనా వేశారు. డ్యాం డౌన్ స్ట్రీమ్‌లో ఆప్రాన్‌కు వెళ్లాలంటే 3-4 కిలోమీటర్లు అప్రోచ్ రోడ్డు కీలకం. 2009 వరదలకు అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయి ఆనవాళ్లే లేకుండా పోయాయి. రిటైనింగ్ వాల్ 2.50 కిలోమీటర్లు ఉంటే.. 600 మీటర్లు పూర్తిగా కొట్టుకు పోయింది. డ్యాం ఇంటర్మీడియట్ లెవల్ గ్యాలరీలు లీకేజీలు, ముఖ్యంగా స్టీల్ సిలెండర్లకు రంధ్రాలకు తక్షణ మరమ్మతులు చేయాల్సి ఉంది. ప్రమాకరంగా మారిన ప్లంజ్‌పూల్ గుంత పూడ్చివేతకు ఎలాంటి ఆధునిక పద్ధతులు చేపట్టాలో ఆధ్యాయనం కోసం పూణేకు చెందిన సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్‌ఎస్)ను గుర్తించారు. ఈ సంస్థకు అడ్వాన్స్‌గా తక్షణం రూ.50 లక్షలు చెల్లించాలి. ఆయా పనుల కోసం డివిడెండ్ రీఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (డ్రిప్-2) గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.135 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. కేంద్రాన్ని ఒప్పించి నిధులు తీసుకురావడంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందింది. తాజాగా ఆ ప్రతిపాదనలు రూ.203 కోట్లకుపైగా చేరాయి. అయితే డ్యాంను పరిశీలించిన ప్రపంచ బ్యాంక్ బృందం అత్యవసరం పనులకు ప్రతిపాదనలు పంపమంటే రూ.108 కోట్లకు పంపారు. ప్రపంచ బ్యాంక్ ఒప్పుకున్నా.. ప్రభుత్వం వద్ద పెండింగులో ఉంది. నాడు వైసీపీ ప్రభుత్వం, తాజాగా కూటమి ప్రభుత్వం వచ్చాక మొత్తం 13 సార్లు ప్రతిపాదనలు పంపినా స్పందించలేదని తెలుస్తుంది.

తక్షణం రూ.34 కోట్లు కావాలి

డ్యాం డౌన్ స్ట్రీమ్‌లో ఆప్రాన్‌కు వెళ్లాలంటే అప్రోచ్ రోడ్డు, కుడి, ఎడమ గట్లు స్లిప్ కాకుండా మరమ్మతులు.. వంటి వివిధ పనులకు తక్షణం రూ.34 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అలాగే.. ప్లంజ్‌పూల్ అధ్యయనం కోసం సీడబ్ల్యూపీఆర్‌ఎస్‌కు రూ.50 లక్షలు అడ్వాన్స్ చెల్లించాలని ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ఫలితంగా మరమ్మతులు ప్రశ్నార్థకంగా మారాయి. ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్ జైన్ లేఖతో రాయడం, ఆ అంశాలను ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. సీఎం చంద్రబాబు స్పందించడమే కాకుండా మరమ్మతులకు అంచనాలు తయారు చేయ మని ఆదేశాలు జారీ చేయడంతో మరమ్మతులపై ఆశలు చిగురిస్తున్నాయి.

నిధులు రాగానే మరమ్మతులు చేపడుతాం

శ్రీశైలం ప్రాజెక్టు తక్షణ మరమ్మతులకు రూ.34 కోట్లు, ఫ్లంజ్ పూల్ అధ్యయనం కోసం రూ.50లక్షలు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే మరమ్మతులు చేపడుతాం. అప్రోచ్ రోడ్డు, కుడి, ఎడమ గట్లు స్లోప్స్ మరమ్మతులు తక్షణమే చేపట్టాలి.

- కబీర్‌బాషా, సీఈ, ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్, కర్నూలు.

హత్యకేసులో గుంతకల్లు ఎమ్మెల్యే సోదరుడి అరెస్ట్

- కాంగ్రెస్ నేత హత్య కేసులో కీలక మలుపు
- త్వరలో మరికొందరి అరెస్ట్
- కర్నూలు జిల్లా ఏఎస్పీ హుసేన్ పీరా

ఆలూరు/కర్నూలు, మే 13(ఆంధ్రజ్యోతి): ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య కేసులో అనంతపురం జిల్లా గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు, ఆలూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. స్వగ్రామం చిప్పగిరి మండలం గుమ్మనూరు గ్రామంలో ఇంట్లో గుమ్మనూరు నారాయణ ఉన్నారని పక్కా సమాచారంతో ఏఎస్పీ హుసేన్ పీరా, పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య ఆధ్వర్యంలో భారీఎత్తున పోలీసు బలగాలు గుమ్మనూరు చేరుకొని అరెస్టు చేశారు. నారాయణ మాజీ మంత్రి, గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం సోదరుడు కావడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ నేత చిప్పగిరి లక్ష్మీనారాయణ గుంతకల్లులో పనులు ముగించుకొని తన వాహనంలో స్వగ్రామం చిప్పగిరికి బయలుదేరుగా.. గుంతకల్లు శివారులో రైల్వేగేట్ వద్ద పక్కా ప్రణాళికతో టిప్పర్‌తో ఢీకొట్టి, ఆ వెంటనే మారుణా యుధాలతో లక్ష్మీనారాయణను అతిదారుణంగా హతమార్చిన విషయం తెలిసిందే.

లక్ష్మీనారాయణ 2007 నవంబరు 18న జరిగిన కర్నూలు జిల్లా కీలక టీడీపీ నేత, కేడీసీసీబీ మాజీ చైర్మన్ వైకుంఠం శ్రీరాములు, ఆయన సతీమణి శకుంతలమ్మ దంపతులను జంట హత్య కేసులో ఏడో నిందితుడుగా ఉన్నారు. ఈ కేసును న్యాయస్థానం కొట్టివేసింది. దీనికి ప్రతికారంగానే నారాయణ హత్య చేయించి ఉంటారనే అనుమానంతో లక్ష్మీనారాయణ కుమారుడు వినోద్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీడీపీ నేత వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం మల్లికార్జున, కొండ రామాంజి, అరికేర మల్లేశ్‌లపై చిప్పగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

గుంతకల్లులో భూ వివాదం..

అయితే గుంతకల్లు పట్టణంలో ఓ భూమి వివాద పంచాయితీలో కాంగ్రెస్ నేత లక్ష్మీనారాయణకు, గుంతకల్లుకు చెందిన గౌసియాబేగం మధ్య విభేదాలు తలెత్తడంతో.. గౌసియా ఈ హత్య చేయించారని పోలీసులు దర్యాప్తులు తేలడంతో గౌసియా, పెద్దన్న, సౌభాగ్య, రాజేశ్‌లతో పాటు మరో ఆరుగురిని పోలీసులు ఈ కేసులో నిందితులుగా చేర్చారు. ఇప్పటికే గౌసియా, సౌభాగ్య, రాజేశ్‌ను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయస్థానం రిమాండ్‌కు ఆదేశించింది. ఎవరూ ఊహించని విధంగా గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణను పోలీసులు అరెస్టు చేయడం ఆలూరు, గుంతకల్లు నియోజకవర్గాల్లో రాజకీయంగా చర్చగా మారింది. అరెస్టుచేసిన నారాయణను ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు అనంతరం ఆలూరు న్యాయస్థానంలో హాజరు పరచగా న్యాయాధికారి 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించారు. దీంతో కర్నూలు జిల్లా జైలుకు తరలించారు. అరెస్ట్‌పై ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డితో కలసి అడిషినల్ ఎస్పీ హుసేన్‌పీరా, పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్యలు ఆలూరు పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. హత్య కేసు వివిధ కోణాల్లో దర్యాప్తు చేసినప్పుడు సాంకేతిక ఆధారాలు (టెక్నికల్ ఎవిడెన్స్), సెల్‌ఫోన్ డేటా ఆధారాలను పరిశీలిస్తే.. ఈ కేసులో గుమ్మనూరు నారాయణ పాత్ర కూడా ఉన్నట్లు తేలడంతోనే అరెస్టు చేశామని తెలిపారు. రైల్వే టెండర్లు, కమిషన్ల విషయంలో చిప్పగిరి లక్ష్మీనారాయణ, గుమ్మనూరు నారాయణల మధ్య విభేదాలు ఉన్నాయన్నారు. దీనికి తోడు భూవివాదాల కారణంగా హత్యకు గురైన లక్ష్మీనారాయణ గుంతకల్లుకు చెందిన గౌసియా, పెద్దన్న, రాజేష్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతానని బెదిరించడంతో ఎలాగైనా ఆయనను హత్య చేయాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. హత్యకు ఉపయోగించిన టిప్పర్‌ను కొనుగోలు చేసేందుకు రూ.2 లక్షలు ఆర్థిక సాయం గుమ్మనూరు నారాయణ అందించాడని, హత్య జరిగిన తరువాత వారి అవసరాల కోసం మరో రూ.1.50 లక్షలు ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. ఇదే విషయాన్ని నిందితుడు గుమ్మనూరు నారాయణ కూడా విచారణలో అంగీకరించడంతో అరెస్టు చేశామన్నారు. అతడి నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ కేసులో త్వరలో మరికొందరిని త్వరలోనే అరెస్టు చేస్తామని వెల్లడించారు.



హత్య కేసులో నారాయణ అరెస్టును చూపుతున్న అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా

అభ్యాస ఫలితాల్లో మార్పే లక్ష్యం

- నూతన విద్యావిధానం జీవో విడుదల
- డ్రాపౌట్స్ నివారించేందుకు కసరత్తు



నంద్యాల ఎడ్యుకేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యావిధానంలో భాగంగా 2025-26 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థుల అభ్యాస ఫలితాలను మార్చే లక్ష్యంతో రూపొందించిన సమగ్ర నమూనాను పాఠశాల విద్యాశాఖ మంగళవారం విడుదల చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ పెరగడం, ఉపాధ్యాయులపై పనిభారం అధికం కావడం, తరగతి గదుల్లో సరైన మౌలిక సదుపాయాలు కల్పించలేకపోవడం తదితర కారణాలతో అనేక మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపడం జరిగిందని ప్రభుత్వం గుర్తించింది. దీన్ని నివారించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కసరత్తు చేసి రాబోయే విద్యాసంవత్సరంలో ఏర్పాటుచేయనున్న విద్యావ్యవస్థలో మార్పులను ప్రకటించింది, మెగా డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో 13,192 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి పూనుకుంది. అందులో భాగంగానే మున్సిపల్ పాఠశాలల పర్యవేక్షణ, పరిపాలనా బాధ్యతను విద్యాశాఖకు అప్పగించింది.

పాఠశాలల విధానం ఇదీ

- శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్(పీపీ1, పీపీ2)

అంగన్‌వాడీకేంద్రాలు శాటిలైట్ ఫౌండేషన్ స్కూల్‌గా మారి యథావిధిగా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తాయి.

- ఫౌండేషన్ స్కూల్(పీపీ1, పీపీ2, క్లాస్1, 2)

సమీప ప్రాథమిక పాఠశాలలకు కిలోమీటర్ దూరానికి పైగా ఉన్న అంగన్‌వాడీలను పాఠశాలలో విలీనం చేస్తారు. పీపీ1, 2 విద్యార్థులకు అంగన్‌వాడీ వర్కర్‌లు, క్లాస్1, 2 తరగతులకు ఎస్జీటీలు బోధిస్తారు.

- బేసిక్ ప్రైమరీ స్కూల్(పీపీ1, పీపీ2, క్లాస్ 1 నుంచి 5వతరగతి వరకు)

1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 59 మంది విద్యార్థుల లోపు ఉంటే ఇద్దరు ఎస్జీటీలతో బోధిస్తారు.

- మోడల్ ప్రైమరీ స్కూల్(పీపీ1, పీపీ2, క్లాస్ 1 నుంచి 5వ తరగతి వరకు)

1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 60 మంది విద్యార్థుల కన్నా ఎక్కువగా ఉంటే నలుగురు ఎస్జీటీలతో బోధిస్తారు.

- ఉన్నత ప్రాథమిక పాఠశాల (పీపీ1, పీపీ2, క్లాస్ 1 నుంచి 8వ తరగతి వరకు)

1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాల లేదా మోడల్ పాఠశాలగా పనిచేస్తుంది. వీరికి ఎస్జీటీల చేత బోధిస్తారు. 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు స్కూల్ అసిస్టెంట్‌లు బోధిస్తారు.

- హైస్కూల్ (6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు)

ఈ పాఠశాలల్లో 6 నుంచి 10 తరగతులకు కేవలం స్కూల్ అసిస్టెంట్‌లతోనే బోధించడం జరుగుతుంది.

- హైస్కూల్ (1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు)

ఈ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 5వరకు ఎస్జీటీలు, 6 నుంచి 10 తరగతులకు స్కూల్ అసిస్టెంట్లు బోధిస్తారు. ప్రధానోపాధ్యాయులు టైంటేబుల్ ను రూపొందిస్తారు.

- హైస్కూల్ ప్లస్ (6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు)

మొత్తం 7 తరగతుల విద్యార్థులకు స్కూల్ అసిస్టెంట్లు బోధిస్తారు.

- హైస్కూల్ ప్లస్(1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు)

1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఎస్జీటీలు, 6 నుంచి 12వరకు స్కూల్‌అసిస్టెంట్లు బోధిస్తారు. ప్రధానోపాధ్యాయులు అన్ని తరగతులకు టైంటేబుల్‌ను రూపొందిస్తారు.

అప్పుల బాధతో కౌలు రైతు బలవన్మరణం

బండిఆత్మకూరు, మే13(ఆంధ్రజ్యోతి): అప్పులు అధికం కావడంతో ఉరేసుకొని ఓ కౌలురైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని భోజనం గ్రామంలో చోటు చేసుకున్నట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన చాకలి రాముడు(65) అనే రైతు తనకున్న ఎకరా పొలంతో పాటు మరో 10ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. వ్యవసాయంలో సుమారు రూ.12లక్షల దాకా అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే స్థోమత లేక సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడి మనవడి పెళ్లి మంగళవారమే ఉండటంతో ఆ ఇంట విషాదం అలుముకుంది.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

ఆదోని రూరల్/ఆస్పరి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆస్పరి మండలంలోని ములుగుందం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గోవిందు(30) పిడుగుపాటుతో మృతిచెందాడు. వివరాల మేరకు.. మృతుడు మరో కాపరి ఆంజనేయతో కలిసి ఆదోని మండలం చిన్నహరివాణం పొలాల్లో గొర్రెలను మేపేందుకు వెళ్లారు. మధ్యాహ్నం ఉరు ములు, మెరుపులు, పిడుగులతో వర్షం కురిసింది. వీరు ఓ కంప చెట్టు వద్దకు చేరారు. గోవిందు కంపచెట్టుకింద నిలబడగా, ఆంజనేయులు కింద కూర్చున్నాడు. ఇంతలో పిడుగు పడడంతో ఇరువురు కుప్పకూలారు. కొద్దిసేపటికి ఆంజనేయులుకు స్పృహ రావడంతో గోవిందును లేపేందుకు ప్రయత్నించగా లేవలేదు. గోవిందు శరీరంపై గాయమైనట్లు గుర్తించి పక్క పొలాల వారికి సమాచారం అందజేశారు. అప్పటికే గోవిందు మృతిచెందాడని తెలుసుకుని రెవెన్యూ, పోలీ సులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియాసుపత్రికి తరలించారు. భార్య రంగవేణి, కుటుంబ సభ్యులు చేరుకొని కన్నీరు మున్నీరయ్యారు.



గోవిందు(ఫైల్)

అదుపులో ఎద్దుల దొంగ

పత్తికొండ, మే13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూటూరు గ్రామంలో గత నెల 29న చోటుచేసుకున్న ఎద్దుల దొంగతనంలో కర్ణాటక రాష్ట్రం సింధనూరుకు చెందిన హనీఫ్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ జయన్న తెలిపారు. మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. గ్రామానికి చెందిన హరిజన సంజన్నకు చెందిన 4 ఎద్దులను నిందితుడు మరోవ్యక్తితో కలసి ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి, సీసీ పుటేజీలను పరిశీలించగా నిందితులు వాడిన వాహనం , ఎద్దులు తరలిస్తున్న దృశ్యాలు గుర్తించామన్నారు. దొంగలు కర్ణాటక రాష్ట్రం సింధనూరుకు చెందినవారుగా గుర్తించి, వాహనంతోపాటు నిందుతుల్లో ఒకరైన హనీఫ్‌ను మంగళవారం హోసూరు రహదారిలో అరెస్టుచేశామన్నారు. మరో నిందుతుడి ఆచూకీ కోసం గాలిస్తున్నామన్నారు. వాహనంతోపాటు దొంగిలించిన ఎద్దులలను అమ్మగా వచ్చిన రూ.2.60లక్షలను రికవరీ చేశామన్నారు.

భార్య హత్య కేసులో అరెస్టు

బేతంచెర్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన కేసులో భర్తను అరెస్టు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని గౌరిపేటలో నివాసముంటున్న షేక్ జకియా బేగంను ఈనెల 10వ తేదీన హత్యకు గురైంది. ఆమెను భర్త షేక్ రసూల్ హత్య చేసి పరారయ్యాడు. అతడు బనగానపల్లె రహదారిలోని బీసీ రాజారెడ్డి మినరల్ వాటర్ ప్లాంటు వద్ద ఉన్న మౌలాలిస్వామి దర్గా వద్ద ఉన్నట్లు సమాచారం అందింది. మంగళవారం మధ్యాహ్నం సీఐ, ఎస్ఐ మహేష్‌బాబు సిబ్బందితో కలిసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని డోన్ కోర్టులో హాజరు పరచగా. మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఎమ్మిగనూరు రూరల్, మే13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సోమవారం అర్ధరాత్రి యువకుడు మృతి చెందాడు. ఎమ్మిగనూరు పట్టణంలోని లక్ష్మిపేట వీధికి చెందిన షేక్ అమాన్ అలి(23) తన మిత్రులతో కలిసి కారులో ఆదోని వెళ్లాడు. అయితే ఆదోని నుండి ఎమ్మిగనూరుకు వస్తున్న సమయంలో బోడబండ సమీపానికి రాగానే కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కారు డ్రైవింగ్ చేస్తున్న షేక్ అమాన్ అలి అక్కడికక్కడే మృతి చెందగా కారులో ఉన్న మిత్రులకు చిన్నపాటి గాయాలయ్యాయి. అలి మిత్రులు కుటుంబ సభ్యులకు తెలిపారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రమాద స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

అవుకు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెట్టుపల్లె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముడావత్ రసూల్‌నాయక్ (61) అనే వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. రసూల్‌నాయక్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఉదయం అవుకు టన్నెల్‌లో కూలీ పనులు చేసుకొనేందుకు మోటర్ సైకిల్‌పై వెళుతుండగా మెట్టుపల్లె సమీపంలోకి వెళ్లే సరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో రసూల్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమాస్టరం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీదేవిభాయి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ

పత్తికొండ, మే13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుమ్మరివీధిలో తాళం వేసి ఉన్న ఇంట్లో మంగళవారం దొంగతనం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. ముత్యాల లక్ష్మన్న అనే వ్యక్తి బంధువుల ఫంక్షన్ ఉండడంతో ఇంటికి తాళంవేసి కుటుంబసభ్యులతో సహా వెళ్లారు. సాయంత్రం ఇంటికి తిరిగి రాగా తలుపులు తెరిచి ఉండడంతో చోరీజరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ జయన్న పరిశీలించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. బీరువాలో ఉన్న రూ 13వేలు, రెండు తులాల బంగారు చోరీకి గురయిందని ఫిర్యాదులో పేర్కొన్నారని సీఐ తెలిపారు.

ముదిరిన వివాదం

- కేఎంసీ క్యాంటీన్‌కు తాళంవేసిన సంఘం నేతలు
- తాళాలు పగులకొట్టిన నిర్వాహకులు
- ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు

కర్నూలు హస్పిటల్, మే 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ క్యాంటీన్‌లో వివాదం ముదిరింది. సోమవారం ఉదయం 11 గంటలకు ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు క్యాంటీన్‌కు తాళాలు వేశారు. ఐదు గంటలు కాకముందే క్యాంటీన్‌కు వేసిన తాళాలను పగల కొట్టి క్యాంటీన్‌ను పునఃప్రారంభించారు. క్యాంటీన్ మాదేనని వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.బ్రహ్మాజీ మాస్టర్ అంటుంటే.. కాదు 30 ఏళ్లకు అగ్రిమెంటు ఉందని, క్యాంటీన్ మాదేనని డా.వరప్రసాద్ అంటున్నారు. మరో పక్క వైద్యుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు డా.బ్రహ్మాజీ మాస్టర్, డా.రామశివ నాయక్, కోశాధికారి డా.డమం శ్రీనివాసులు, ఈసీ సభ్యులు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.సాయిసుధీర్‌కు క్యాంటీన్ వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. డా.వరప్రసాద్ పేరుతో క్యాంటీన్‌ను నడుపుతున్న అనధికార వ్యక్తులకు పదేపదే నోటీసులు ఇచ్చామన్నారు. సోమవా రం ఉదయం క్యాంటీన్‌కు తాము తాళంవేస్తే.. సాయంత్రం క్యాంటీన్ తాళం పగులకొట్టి అక్రమంగా ప్రవేశించారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు వివరించారు. దీనిపై క్యాంటీన్ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని గొడవలు జరగకుండా పోలీసులు సహకారం ఉండాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాళం పగులగొట్టడం నేరమని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు వివరించారు. దీనిపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.సాయిసుధీర్ మాట్లాడుతూ సంఘం నేతల ఫిర్యాదును ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకు వెళ్లానని క్యాంటీన్ వ్యవహారంలో గొడవలు జరగకుండా రోగులకు ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో నెలకొల్పాలని త్రీటౌన్ సీఐకి లేఖలు రాసినట్లు తెలిపారు.



ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న వైద్యులు

పారిశ్రామిక అభివృద్ధికి సహకరించాలి

- తమ సంస్థలో పీఎఫ్‌ఓఏ కెమికల్‌కు దూరం
- మేధావులు ఆరు నెలల్లో నిరూపించాలి
- ఆ తరువాతే ఉత్పత్తి చేపడుతాం
- టీజీవీ గ్రూప్స్ అధినేత, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు, మే13 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని టీజీవీ గ్రూప్స్ అధినేత, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కోరారు. టీజీవీ ఎస్ఆర్ఏఏసీ ప్రతిపాదిత విస్తరణలో పీఎఫ్ఓఏ కెమికల్, దాని సంబంధిత లవణాన్ని వాడడం లేదని ఆయన స్పష్టంచేశారు. మంగళవారం నగరంలోని మౌర్యఇన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. పీఎఫ్ఓఏ కెమికల్ దిగుమతి చేసుకోవడానికి, వినియోగించడానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేదని, ఆ కెమికల్ ప్రభుత్వ నిషేధిత జాబితాలో ఉందని తెలిపారు. తమ పరిశ్రమ నుంచి క్లాసిక్ సోడా, క్లోరోమీథేన్స్ సామర్థ్య విస్తరణ, పీటీఎఫ్ఈ అదనపు ఉత్పత్తుల కోసం ప్రభుత్వ అనుమతి తీసుకున్నామన్నారు. ఈ నెల 14న ప్రజా అభిప్రాయ సేకరణ ఉందని తెలిపారు. ఈ ప్లాంట్ వల్ల ప్రమాదకరమని కొందరు దుష్ప్రచారం చేస్తున్నార న్నారు. క్లాసిక్ సోడా తయారీ పరిశ్రమలు ఏపీలో 4, తమిళనాడులో 4, కేరళలో ఒకటి ఉందని, వివిధ రాష్ట్రాల్లో 35 ఉన్నాయని తెలిపారు. అక్కడ లేని ప్రమాదం కర్నూ లులో ఉంటుందా..? ఇక్కడ మాత్రం ఆందో ళనలు చేయడం ఎంత వరకు న్యాయమని, ఎక్కడ కూడా ఈ పరిశ్రమలు ప్రమాదక రమని చెప్పలేదని అన్నారు. ఆ ప్రాంతంలో పని చేసే కొందరు మేధావులు, ప్రజలు వచ్చి కావాలనే ఇక్కడి ప్రజలను తప్పుతోవ పట్టిస్తూ రెచ్చగొడుతున్నారని పేర్కొన్నారు. ఇక్కడ తయారయ్యే క్లోరిన్ సుమారుగా 130 కోట్ల ప్రజల తాగునీటిని శుద్ధి చేయడానికి వాడుతు న్నారని, నీటి శుద్ధికి క్లోరిన్ వాడకపోతే ఏటా లక్షల మంది చనిపోయే ప్రమాదం ఉందని గుర్తు చేశారు. ఇక్కడ ఉత్పత్తయ్యే క్లాసిక్ సోడా, హైడ్రో క్లోరిన్ ఆసిడ్ వివిధ రకాల ఔషదాలు తయారీలో ఉపయోగిస్తారని తెలిపారు. ఈ కెమికల్స్ వాడకుండా ఎలాంటి మందులు తయారు చేయలేర న్నారు. తాము విస్తరించబోయే పరిశ్రమలో ఎలాంటి పీఎఫ్ఓఏ కెమికల్, దాని సంబంధిత లవణాన్ని వినియోగించడం లేదని, అనుమానం ఉన్న వ్యక్తులు, శాస్త్రవేత్తలు ఆరు నెలల్లోగా దీనిని నిరూపించాలని, ఆ తరువాతే పీటీఎఫ్ఈ ఉత్పత్తి చేపడుతామని టీజీ వివరించారు. దేశంలో పీటీఎఫ్ఈ ఉత్పత్తి పరిశ్రమలు మూడు ఉన్నాయని, ఇళ్లలో వాడే నీటి పైపుల తయారీకి ప్రపంచంలో విస్తారంగా వినియోగిస్తున్నారని గుర్తు చేశారు. ఇక్కడ తయారయ్యే కార్బన్ టెట్రాక్లోరైడ్‌ను భారత ప్రభుత్వ పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతి పొందిన వ్యవసాయ రసాయనాలు తయారీదారులకు మాత్రమే సరఫరా చేస్తున్నామని, ఇందుకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని టీజీ పేర్కొన్నారు. తమ పరిశ్రమ పరిసర గ్రామాల్లో అవసరమైన మౌలిక, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నా మన్నారు. వివిధ సామాజికవర్గాల అభివృద్ధి కోసం సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు.



నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

కనీస వేతనం ఇవ్వాలి

బండిఆత్మకూరు మే13(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ కార్మికులకు కనీస వేతనం అందజేయాలని సీఐటీయూ మండల నాయకుడు రత్నమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపీడీవో దస్తగిరికి 29వ తేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నోటీసును కార్మికులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఇచ్చే రూ.21000 జీతం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా వర్తింపజేయాలని కోరారు. కూలీలు 29న నిర్వహించే సమ్మెకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాజు పాల్గొన్నారు.

వైభవంగా పారువేట



అశ్వవాహనంపై విహరిస్తున్న చెన్నకేశవస్వామి

మిడుతూరు, మే 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక లక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైభవంగా పారువేట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కాతా రామచంద్రారెడ్డి ఆలయ సేవాకమిటీ మెంబరు భూమ క్రిష్ణమోహన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అశ్వవాహనంపై కుర్చున్న ఆదికేశవుడు ఆలయ గర్భగుడి చుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు చేశారు. దేవాలయం నుంచి గుర్రంపై స్వారీచేస్తూ గ్రామ శివార్లలో ఉన్న సూర్యనారాయణ మండపం వద్దకు చేరుకున్నాడు. అక్కడ పూజల అనంతరం వినోదం కోసం స్వామివారి సమక్షంలో సంప్రదాయం బద్ధంగా పారువేట కార్యక్రమం జరుగుతుంది.

సీహెచ్‌వోల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల హాస్పిటల్, మే 13 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (సీహెచ్‌వో) సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నంద్యాల జిల్లా సీహెచ్‌వోల సంఘం అధ్యక్షుడు శివకృష్ణ కోరారు. మంగళవారం సీహెచ్‌వోల ధర్నా 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టాల్సి వచ్చిందన్నారు. నేషనల్ హెల్త్‌మిషన్ కింద ఆరేళ్ల నుంచి పనిచేస్తున్న తమకు 23శాతం వేతన సవరణ చేయాలని, నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అందించాలన్నారు. జిల్లాలో కొన్నిచోట్ల అద్దెభవనాల్లో క్లినిక్‌లు నిర్వహిస్తున్నామని, వాటి బకాయిలు చెల్లించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించేంతవరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సౌందర్య, కార్యదర్శి అఖిల్, ఉపాధ్యక్షులు భాస్కర్, భార్గవ్, చక్రధర్, జిల్లాలోని సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

ఫలితాల ఆధారిత విద్య గుర్తింపుపై శిక్షణ

నంద్యాల రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణ సమీపంలోని ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కాలేజిలో ఫలితాల ఆధారిత విద్య, గుర్తింపు అనే అంశంపై ఐదు రోజుల అంతర్గత ఫ్యాకల్టీ శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈకార్యక్రమాన్ని సిఎస్ఈ, సిఎస్ఈ(ఏ1) విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. శిక్షణలో ప్రముఖ వక్తగా జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం కాలేజి ఆఫ్ ఇంజనీరింగ్ నాచుపల్లి (యుసిఈజె), జగిత్యాల జిల్లా తెలంగాణ నుంచి కంప్యూటర్స్ సైన్స్ విభాగ సీనియర్ ప్రొఫెసర్, ప్రిన్సిపాల్ డాక్టర్ విశ్వనాథ్ రాజులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఫలితాల ఆధారిత విద్య (ఓబిఈ) అక్రిటేషన్ ప్రాముఖ్యతపై విశ్లేషణాత్మకంగా, విలువైన సమాచారాన్ని అందించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ దినేష్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్స్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ హరిప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

సమావేశాలకు తప్పక హాజరు కావాలి



అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు

వెలుగోడు, మే 13 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు కావాల్సిందేనని, అనుమతి లేకుండా గైర్హాజరైతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ రమేష్, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రమేష్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి పలువురు అధికారులు గైర్హాజరు కావడంతో ఎంపీటీసీలు అధికారులను నిలదీశారు. గత సమావేశాల్లో జరిగిన చర్చలకు సమాధానాలు ఇవ్వనప్పుడు ఈ సమావేశాలు ఎందుకు అని ప్రశ్నించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసగౌడు, జడ్పీ కోఆప్షన్ మెంబరు ఇలియాజ్ ఖాన్, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్థానికులకు చిక్కిన జింక

గోస్పాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంబవరం గ్రామం లో దారితప్పి వచ్చిన జింకను మంగళవారం స్థానికులు చిక్కింది. హెడ్‌కానిస్టేబుల్ గోపాల్‌నాయక్ నంద్యాల అటవీ అధికారులకు జింక లభించిన సమాచారం అందించారు. ఫారెస్ట్ అధికారులతో కలిసి అడవిలో వదిలిపెట్టారు. అటవీ అధికారులు మాట్లాడుతూ జింకకు ఎలాంటి హాని తలపెట్టకుండా క్షేమంగా అప్పగించిన గ్రామస్థులను, హెడ్‌కానిస్టేబుల్ గోపాల్ నాయక్‌ను వారు అభినందించారు.

క్యూఆర్ కోడ్ స్కానర్‌తో..
సమస్యలు పరిష్కారం

నంద్యాల మున్సిపాలిటీ మే 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రతి ఆర్టీసీ బస్టాండ్‌లో క్యూఆర్‌కోడ్ స్కానర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు నంద్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో సైతం ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం స్కానర్లు ఏర్పాటు చేశారు. ఈ స్కానర్ల ద్వారా సమస్యలుంటే ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

● ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో నంద్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు





నంద్యాల ఆర్టీసీ బస్టాండ్

సమస్యలు పరిష్కారం అవుతున్నాయి



బస్టాండ్‌లో క్యూఆర్ కోడ్ స్కానర్ వల్ల పలు సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లగలుగుతాం. బస్టాండులో ప్రయాణికులకు కుర్చీలతో పాటు మంచి నీటిసౌకర్యం కావాలని స్కానర్ ద్వారా విజ్ఞప్తిచేశా. అధికారులు స్పందించారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం చాలా మంచిది.

\- గిరి, ప్రయాణికుడు

హర్షనీయం



ప్రయాణికుల ఇబ్బందులు తొలగించటానికి ప్రభుత్వం బస్టాండుల్లో క్యూఆర్‌కోడ్ స్కానర్లను ఏర్పాటు చేయడం హర్షనీయం. అధికారులు ప్రయాణికులు చేస్తున్న విజ్ఞప్తులు పరిష్కరించడానికి మరింత వేగంగా స్పందిస్తే ప్ర యాణికులు ఆర్టీసీ ప్రయాణానికి మొగ్గు చూపుతారు.

\- విజయకుమార్, ప్రయాణికుడు

విజ్ఞప్తులు వస్తున్నాయి

రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని బస్టాండులో స్కానర్లు ఏర్పాటుచేశాం. ప్రయాణికులు స్కానర్ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళుతున్నారు. బస్టాండులో కుర్చీలతో పాటు నీటి సమస్య తీర్చాలని, మరుగుదొడ్ల సమస్య పరిష్కరించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా ప్రయాణికులు చేస్తున్న విజ్ఞప్తులను పరిష్కరిస్తున్నాం.

\- రిజియా సుల్తానా, ఆర్ఎం

ప్రయాణికులకు సౌకర్యాల ఏర్పాటు

పాణ్యం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పాణ్యం ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు నంద్యాల ఆర్టీసీ డీఎం గంగాధర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పాణ్యం బస్టాండ్‌లోని పరిసరాలను శుభ్రం చేయించారు. ప్రయాణికులు ఎండలో ఉండకుండా నీడ తెరచాపలు ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మరుగుదొడ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. బస్టాండు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రయాణికులు, స్థానికులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళీశ్వరగౌడ్, పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, ఆర్టీసీ అధికారులు శ్రీరాములు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పాణ్యంలో ఆర్టీసీ స్థలాన్ని పరిశీలిస్తున్నఆర్టీసీ డీఎం గంగాధర్

రమణీయం.. లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గౌరుచరిత

గడివేముల, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం మంగళవారం రమణీయంగా సాగింది. ఆలయ అర్చకులు స్వామివారికి మహా సుదర్శన యాగం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై కొలువుంచి అర్చకులు పూజలు చేశారు. మహాకుంభ జలసంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గౌరుచరిత స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారి నామస్మరణ చేస్తుండగా రథాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు.

మద్యం దుకాణానికి దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు, మే 13(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పగిడ్యాల మండలంలో గీతాకులాల మద్యం దుకాణ ఏర్పాటుకు సంబంధించి ఆసక్తి గల గౌడ కులస్తుల దుకాణ ఏర్పాటు కోసం ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ మంగళవారం తెలిపారు. దుకాణ ఏర్పాటుకు సంబంధించి నంద్యాల జిల్లాకు చెందిన వారు మాత్రమే అర్హులన్నారు. తహసీల్దార్ నుంచి కులధృవీకరణ పత్రాలను దరఖాస్తులో సమర్పించాలన్నారు. ఒక్కో దుకాణానికి నాన్ రీఫండబుల్ ఫీజు రూ.2లక్షలు డీడీ లేదా చలానా రూపంలో ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ.11,45,834 అలాగే 2025-26 సంవత్సరానికి సంబంధించి రూ.30,25,000 లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు నందికొట్కూరు ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు 9440 902576ను సంప్రదించాలని సూచించారు.

ఆత్మకూరులో భానుడి ఉగ్రరూపం



నిర్మానుష్యంగా ఉన్న సంత మార్కెట్ రహదారి

ఆత్మకూరు, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రచండ భానుడి ఉగ్రరూపంతో ఆత్మకూరు ప్రాంతం మండిపోయింది. మంగళవారం ఆత్మకూరు పట్టణంలో సుమారు 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైంది. ఉదయం 8గంటల నుంచే ఎండ తీవ్రత పెరిగి సాయంత్రం 6గంటల వరకు కూడా ఉష్ణతాపం తగ్గలేదు. దీంతో జనం బయటకు వచ్చేందు కు భయపడుతున్నారు. ఆత్మకూరులో కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై కూడా వాహనాల రాకపోకలు లేక నిర్మానుష్యంగా మారింది.

ప్రభుత్వ భూములు కాపాడాలి

మహానంది, మే 13 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం బుక్కాపురం గ్రామ పరిధిలోని 26-1,30,89,93-1 సర్వే నెంబర్ల లోని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవా రం మహానందిలోని మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవికు సీపీఐ నాయకులు బాబాఫకృద్దీన్ వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సామేలు, రామేశ్వరయ్య, దస్తగిరి, గురుమూర్తి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రీసర్వేను పకడ్బందీగా నిర్వహించండి



రీసర్వేను తనిఖీ చేస్తున్న ఆర్డీవో చల్లా విశ్వనాథ్

గడివేముల, మే 13 (ఆంధ్రజ్యోతి): రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో చల్లా విశ్వనాథ్, జిల్లా సర్వే అధికారి వెంకటచెన్నయ్య రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తిరుపాడు గ్రామం లో జరుగుతున్న రీసర్వేను మంగళవారం వారు తనిఖీ చేశారు. రీసర్వే రోజుకు ఎన్ని ఎకరాలు చేస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నా రు. రైతులకు నోటీసులు ఇచ్చి రీసర్వే చేయాలని ఆదేశించారు. రీసర్వేను తప్పొప్పులు లేకుండా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలంలో విశేష పూజలు



దాతకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న పర్యవేక్షకులు జి. రవి

శ్రీశైలం, మే 13(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వర స్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతిసౌభాగ్యాలతో విరిసిల్లాలని అర్చకస్వాములు సంకల్పం పఠించారు.

● అన్నప్రసాద వితరణకు విరాళం

శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మంగళవారం న్యూఢిల్లీకి చెందిన సందీప్‌శర్మ అనే భక్తుడు రూ.1,16,000 విరాళాన్ని పర్యవేక్షకులు జి. రవికి అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు రశీదు, స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి,అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

● శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కృష్ణాజిల్లా, పామర్రుకు చెందిన మూర్తి లక్ష్మీశ్యామల బృందం భక్తి గీతాలపై గాత్రకచేరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణేశ పంచరత్నాలు, శంకరా చంద్రశేఖరా, శివుడు తాండవం చేయునమ్మా, హిమగిరి తనయే, భో..శంభో శివశంభో, భ్రమరాంబాతల్లికి మంగళం తదితర గీతాలను మూర్తి లక్ష్మీశ్యామల ఆలపించారు. కార్యక్రమంలో ధూళిపాళ శ్రీనివాస శాస్త్రీ వయొలిన్ సహకారాన్ని అందించగా రాయప్రోలు సుధాకర్ మృదంగ సహకారాన్ని అందించారు.

అమ్మవారికి బోనాల సమర్పణ



మహానంది, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.తిమ్మాపురంలోని అంకాల పరమేశ్వరీదేవికి మహిళలు బోనాలను సమర్పించారు. మంగళవారం అమ్మవారి 12 వార్షికోత్సవం పురస్కరించుకొని అర్చకులు రఘుకుమార్‌శర్మ, శంకరయ్య ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

అధికారులు వేధింపులు వీడాలి



ర్యాలీ చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

నంద్యాల మున్సిపాలిటీ మే 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ దిగువ స్థాయి సిబ్బందిపై అధికారులు వేధింపులు వీడాలని నేషనల్ మజ్దూర్ యూనియన్(ఎన్ఎంయూ) డిమాండ్ చేసింది. ఎన్ఎంయూ రాష్ట్రవ్యాప్తి పిలుపు మేరకు ఆ సంఘం స్థానిక ప్రతినిధులు మంగళవారం నంద్యాలలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ విద్యుత్ కార్యాలయం నుండి డీపీటీవో కార్యాలయం వరకు సాగింది. ఈ ర్యాలీలో జిల్లాలోని 7 డిపోల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ఎన్ఎంసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పీఎస్ఎన్ రావు మాట్లాడుతూ చిన్నచిన్న కారణాలతో కిందిస్థాయి సిబ్బందిని వేధించటం అధికారులకు తగదని హితవు పలికారు. భద్రతా సర్క్యులర్ వెంటనే అమలుచేయడంతో పాటు సిబ్బందికి ప్రమోషన్లు ఇచ్చి పెండింగ్ డీఎలు, ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు వెంటనే ఇచ్చి ఉద్యోగుల ఇబ్బందులు తీర్చాలని కోరారు. గ్యారేజ్ సిబ్బందిపై వేధింపులు తగ్గించడంతో పాటు సంస్థలో ఉన్న 12,000 ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షులు కె.సుదర్శన్ రావు, జి ల్లా కార్యదర్శి కె. శివరాం, జిల్లా చైర్మన్ కె. కోటేశ్వర రావు పాల్గొన్నారు.

శోభాయాత్రను జయప్రదం చేయాలి

నంద్యాల కల్చరల్, మే 13(ఆంధ్రజ్యోతి): 22న తలపెట్టిన వీర హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని నంద్యాల విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం శోభాయాత్రకు సంబంధించిన గోడ పత్రికలు, బ్యానర్లు, స్టికర్లు. ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ దక్షిణ ఆంధ్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జిల్లా సంఘచాలక్ చిలుకూరి శ్రీనివాస్, విభాగసహ కార్యవాహ రామాంజనేయులు, జిల్లా కార్యవాహ రఘురాములు, శోభాయాత్ర ప్రముఖ్ నాగరాజు, రాంప్రసాద్, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ఆత్మకూరురూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని కృష్ణాపురం గ్రామంలో సారా స్థావరాలపై ఎక్సైజ్ సిబ్బంది ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సిఐ కిషోర్ కుమార్ మంగళవారం తెలిపారు. గ్రామంలో బైక్‌పై సారా తరలి స్తుండగా 10 లీటర్ల నాటు సారాను, బైక్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జగదీష్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి అభినందనలు



ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

నంద్యాల హాస్పిటల్, మే 13 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎమర్జెన్సీ మెడిసిన్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ విద్యార్థిని డా.లింషాముస్తఫా చేసిన అసాధారణ పరిశోధనకు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ అత్యుత్తమ పరిశోధనాపత్రం అందజేసింది. ఆమె ఎమర్జెన్సీ విభాగానికి ఉద్దేశపూర్వకంగా స్వీయహానిని ప్రదర్శించే రోగుల ప్రొఫైల్, ఫలితం అనే అంశంపై పరిశోధన చేశారు. ఎమర్జెన్సీ మెడిసిన్ హెడ్ డాక్టర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.మహమ్మద్ రఫీ మార్గదర్శకత్వంలో సైకియాట్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రూపస్‌సహ మార్గనిర్దేశంలో ఈ విజయం దక్కించుకున్నారు. మంగళవారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ డా.బాలేశ్వరి, పరిపాలన విభాగం వైస్ ప్రిన్సిపాల్ డా.రాజశేఖర్, గైడ్ డాక్టర్ మహమ్మద్ రఫిలు ప్రశంసాపత్రాన్ని అందజేసి విద్యార్థినిని అభినందించారు.

గతుకుల రోడ్లకు మోక్షమెన్నడో?

● ఇబ్బంది పడుతున్న రైతులు ● పట్టించుకోని అధికారులు

బండిఆత్మకూ మే13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లోని ఆయకట్టు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. మండలంలో కేసీ కెనాల్, తెలుగుగంగ, 11 చెరువుల కింద సుమారు 30 వేల వరకు ఆయకట్టు భూములున్నాయి. ఈ రహదారులకు 2018-2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆయకట్టు రహదారులకు గ్రావెల్ పరుపులతో అభివృద్ధి పరిచారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కనీసం తట్టెడు గ్రావెల్ కూడా వేయకపోవటంతో ప్రస్తుతం ఆ రహదారులన్నీ గుంతల మయంగా మారాయి. దీంతో రైతులు పొలాలకు రాకపోకలు సాగించాలంటే నానా అవస్థలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం రహదారుల మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



ఏ కోడూరు నుంచి వీ కోడూరు పొలాల మధ్య గుంతల మయమైన ఆయకట్టు రహదారి

గజవాహనంపై చెన్నకేశవస్వామి



చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు

చాగలమర్రి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం గజవాహన ఉత్సవం వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవ ఉత్సవమూర్తుల గ్రామోత్సవం చేశారు. సంజీవరా య స్వామికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకట రమణ, కమిటీ సభ్యులు లక్ష్మీనా రాయణరెడ్డి, నరసింహారెడ్డి, ఆలయ ఉద్యోగులు, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

సామూహిక విష్ణుసహస్ర పారాయణం: స్థానిక చెరువుకట్ట సమీపం లోగల గంగమ్మ ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం మహిళలు సామూహికంగా విష్ణుసహస్ర పారాయణం చేశారు. గంగ మ్మకు సామూహిక వడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి

రుద్రవరం, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లవాగుపల్లె గ్రామంలో టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి మంగళవారం మారెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పార్థసారథిరెడ్డి ఉన్నారు. అలాగే రుద్రవరం మండలం యల్లావత్తులలో గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి గంగమ్మ, పెద్దమ్మ అమ్మవారిని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు సమర్పించారు.

మారెమ్మ జాతర: మండలంలోని నల్లవాగుపల్లె గ్రామంలో మంగళవారం మారెమ్మ జాతర ఘనంగా జరి గింది. భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

సుంకులమ్మకు..

డోన్ రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని సుంకులమ్మ అమ్మవారి ప్రత్యేక పూజల్లో డోన్ టీడీపీ యువ నాయకుడు ధర్మవరం మన్నె గౌతమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. పట్టణానికి చెందిన ఐటీడీపీ కమిటీ నాయకులు పార్థసారధి రెడ్డి ఆహ్వానం మేరకు సుంకులమ్మ ప్రత్యేక పూజల్లో గౌతమ్ రెడ్డి పాల్గొన్నారు.

గడువు పొడిగించాలి: ఎమ్మార్పీఎస్

బేతంచెర్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎస్సీ కార్పొరేసన్ రుణాల దరఖాస్తు చేసుకోవడానికి వారం రోజులు గడువు పొడిగించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి తాలుకా రాజయ్య మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాజయ్య మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ అధికారులు ఇచ్చిన గడువు సరిపోవడం లేదన్నారు. సమావేశంలో మద్దయ్య, వెంకటేశ్వర్లు, తిమ్మయ్య, రామకృష్ణ కార్యకర్తలు పాల్గొన్నారు.

20న మండల సర్వసభ్య సమావేశం

డోన్ టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): డోన్ మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20న మండల అధ్యక్షుడు రేగటి రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో ఫక్రుద్దీన్ సాహెబ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని, ఈ సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

బేతంచెర్ల, మే 13(ఆంధ్రజ్యోతి): బేతంచర్ల మండలం సీతారామాపురం మెట్ట వద్ద ఎంబాయి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు వెంకి, మల్లికార్జునప్ప, రాజప్ప మాట్లాడుతూ ఎంబాయి, రుద్రవరం, మండ్లవా నిపల్లె, సంకలాపురం, సీతారామాపురం, బైనపల్లి గ్రామాలకు చెందిన ప్రయాణికులు సీతారామాపురం మెట్ట నుంచి కర్నూలుకు, బేతంచెర్లకు ఇక్కడి నుంచి వెళ్తారన్నారు. కార్యక్రమంలో వెంకి, మల్లికార్జునప్ప, రాజప్ప, జగదీశ్, వెంకటేశ్వర్లు నాయుడు, మధుశేఖర్, మౌలాలి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉపాధి కూలీలు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పనులు చేసుకోవడం మంచిదన్నారు. అధిక భాగం నీడనిచ్చే ప్రదేశాల్లో ఉండాలని అన్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు, గర్భిణులు ఎండకు బయటకు వెళ్లకుండా జాగ్రత్త వహించాలన్నారు. నిమ్మరసం, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకుంటే మంచిదని సూచించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి 14 రోజులు జైలు

రుద్రవరం, మే 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీసుస్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డ వ్యక్తికి 14రోజులు జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆళ్లగడ్డ జెఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా జడ్జి జైలుశిక్షతో పాటు జరిమానా విధించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

దొర్నిపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ అన్నారు. మంగళవారం దొర్నిపాడు గ్రామంలో కిశోరి వికాసం వేసవి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ సమాజంలో బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం అన్నారు. కిశోర వికాసం కౌమార బాలికల సాధికారత గురించి తెలి యజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వెంకటసుబ్బమ్మ, లక్ష్మీ దేవి, చిన్నారులు, తల్లిదండ్రులు ఉన్నారు.

పిల్లర్లకే పరిమితం

- ముందుకు సాగని పాఠశాలల నిర్మాణ పనులు
- సరైన భవనాలు లేక ఇబ్బందుల్లో విద్యార్థులు
- 'మనబడి-మనభవిష్యత్తు'తోనైనా రూపురేఖలు మారేనా?
- మౌలిక వసతులు కల్పించాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు



ముత్యాలపాడు ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా భవన నిర్మాణ పనులు

చాగలమర్రి, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల భవన నిర్మాణ పనులు పిల్లర్లకే పరిమితమయ్యాయి. రెండో విడత 'నాడు-నేడు' కింద దాదాపు రూ.9.49కోట్లు 20 పాఠశాలలకు మంజూరయ్యాయి. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, కమిటీ సభ్యులు కలిసి పనులు ప్రారంభించారు. పనులు పిల్లర్ల వరకు వచ్చాక ఆపేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో భవన పనులు ముందుకు సాగక నిలిచిపోయాయి. దీంతో పాఠశాలలో విద్యార్థులు భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

నిధులు లేక.. ముత్యాలపాడులో మూడు అదనపు గదులకు రూ.11.61 లక్షలు, గొడిగనూరులో మూడు భవనాలకు రూ.14.74 లక్షలు, మద్దూరులో మూడు భవనాలకు రూ.53 లక్షలు, బాలుర ఉన్నత పాఠశాలలో నాలుగు భవనాలకు రూ.36.45 లక్షలు, బాలికోన్నత పాఠశాలకు నాలుగు భవనాలకు రూ.49.88 లక్షలు, చిన్నవంగలి ఉన్నత పాఠశాలలో నాలుగు భవనాలకు రూ.30.20 లక్షలు, కస్తూర్బా పాఠశాలకు రూ3.49 లక్షలు ఖర్చు చేశారు. నిధులు లేక పోవడంతో పాఠశాలలో పనులు అర్థాంతరంగా నిలిపివేశారు. గత ప్రభుత్వంలో నిధులు మంజూరు కాకపోవడంతో పనులు చేయకుండా నిలిపి వేశామని హెచ్‌ఎంలు, కమిటీలు చెబుతున్నాయి.

ఈ విద్యా సంవత్సరంలోనైనా.. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు-నేడును తొలగించి 'మనబడి-మనభవిష్యత్తు'గా మార్చింది. ఈ పథకంతోనైనా అసంపూర్తిగా ఉన్న భవన పనులను పూర్తి చేసి పాఠశాలల్లో విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనైన అసంపూర్తిగా ఉన్న భవన పనులు పూర్తి చేసి సమస్యలు తొలగించాల్సి ఉంది.

బిల్లులు మంజూరు కాక..

గత ప్రభుత్వంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచి పోయాయి. మంజూరైన 15శాతం బిల్లుల వరకు పనులు చేసి వదిలేశారు. ప్రస్తుతం ఉన్నతాధికారులు పాఠశాల భవనాల పనులు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న భవనాల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం.

– అనూరాధ, ఎంఈవో, చాగలమర్రి

అకాల వర్షంతో రైతుల అవస్థలు



వర్షానికి తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

అవుకు, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు అకాల వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం కాగానే ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు జరిగి ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం పడుతుంది. వరి, మొక్కజొన్న, మిరప పంటలు కోత దశకు చేరుకున్నాయి. గాలికి పంటలు నేలవాలుతున్నాయి. మరి కొన్ని చోట్ల రైతులు పంటలను కోసి కల్లాల్లో, రోడ్డుకు పక్కన ఆరబోసుకున్నారు. వర్షం పడుతుండటంతో ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాలను కప్పి కాపాడుకుంటున్నారు. అయినప్పటికీ ధాన్యం తడిసిపోతుంది. తడిసిన ధాన్యాన్ని చూపుతూ రైతులు విలపిస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనేందుకు వ్యాపారులు ముందుకు రాక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంచనాల కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్ళగడ్డ, మే 13(ఆంధ్రజ్యోతి): విజయవాడలో రాష్ట్రస్థాయి అంచనాల కమిటీ సమావేశం ఆకమిటీ చైర్మన్ వేగుల జోగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పలు ప్రణాళికలు, అంచనాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్థిక అంశాలతో పాటు, బడ్జెట్ తదితర అంశాలను ఎస్టిమేట్స్ కమిటీ చైర్మన్, సభ్యులు చర్చించారు. ఎమ్మెల్యే అఖిలప్రియ పలు అంశాలపై కమిటిలో చర్చించారు.

ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయాభివృద్ధికి అనంతపురానికి చెందిన కె.హనుమంతరెడ్డి వారి కుటుంబ సభ్యులు మంగళవారం రూ.లక్ష విరాళం అందించారు. ఆలయాభివృద్ధి కోసం విరాళం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ.ఉమార్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు

ఉయ్యాలవాడ, మే 13 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది 24 గంటలు రోగులకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో ఉమామహేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో ఉన్న ప్రాథమిక వైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. హాస్పిటల్‌లో ఉన్న రికార్డులను పరిశీలించారు. టార్గెట్ల ప్రకారం వైద్యశాలలో ప్రసవాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి వెంకటసుబ్బయ్య, సిబ్బంది ఉన్నారు.

వర్షపు నీరు పారేదెలా ...



నీళ్లలో నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

అవుకు, మే 13 (ఆంధ్రజ్యోతి) : చిన్నపాటి వర్షానికే అవుకు పట్టణంలోని ఈబీసీ కాలనీ నీటి కుంటలా తయారవుతోంది. డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపునీరు, మురుగునీరు ఇళ్లముందు నిల్వ ఉంటోంది. మంగళవారం తెల్లవారుజామున వర్షం పడింది. ఇళ్లముందర నిలచిన నీళ్లల్లో నిలబడి కాలనీ మహిళలు నిరసన వ్యక్తంచేశారు. వీధిలోని సీసీ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే మురికి నీళ్లల్లో నడిచి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం

సమయపాలన పాటించని అధికారులు



ఎంపీడీవో రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

ప్యాపిలి, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజాపరిషత్ అధికారులు విధులపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. సమయపాలన ఏ మాత్రం పాటించడం లేదన్న విమర్శలున్నాయి. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట అయినా అధికారులు విధులకు హాజరు కాలేదు. ఇక్కడ పనిచేసే ఎంపీడీవో కర్నూలులో నివాసముంటూ రోజూ విధులకు ఆలస్యంగా వస్తున్నట్లు విమర్శలున్నాయి. అలాగే డిప్యూటీ ఎంపీడీవో ఇటీవల బదిలీపై వెళ్లారు. సూపరింటెండెంట్ కూడా విధులకు హాజరు కాలేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి మండల పరిషత్ కార్యాలయానికి అధికారులు, సిబ్బంది సకాలంలో విధులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

బేతంచెర్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులనుల పర్మినెంట్ చేయాలని కోరుతూ 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ హరిప్రసాద్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో ఎల్లయ్య, ఖాజా బాషా తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఆరోగ్యంగా ఉండాలి

చాగలమర్రి, మే 13 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా చైల్డ్ ప్రొడక్షన్ అధికారిణి స్వప్న ప్రియదర్శిని అన్నారు. మంగళవారం చాగలమర్రిలోని ఎస్సీ కాలనీ, బుగ్గవీధి, 5వ సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రా ల్లో కిశోరి వికాసం కార్యక్రమం కింద 15 నుంచి 18 సంవత్సరాల బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై బాలి కలకు అవగాహన కల్పించి వారిలో ఉన్న సందేహాలను తొలగించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుశీల, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశాలు, మహిళలు పాల్గొన్నారు.

16, 17వ తేదీల్లో బండలాగుడు పోటీలు

కోవెలకుంట్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్లలోని పాండురంగస్వామి తిరునాళ్ల సందర్భంగా 16, 17 తేదీల్లో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరు కానున్నారు. కోవెలకుంట్లలోని పెద్ద గ్రౌండ్‌లో జేసీబీతో ముళ్ల చెట్లను తొలగించి ఆ స్థలాన్ని శుభ్రం చేసినట్లు ఈవోఆర్‌డీ ప్రకాశ్‌నాయుడు తెలిపారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన టీడీపీ నాయకుడు

రుద్రవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో మండలంలోని కె.కొత్తూరుకు చెందిన టీడీపీ నాయకుడు బచ్చు నాగేశ్వర్‌రెడ్డి మంగళవారం కలిశారు. గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆయన మంత్రిని కోరారు.

సమయపాలన పాటించాలి

రుద్రవరం, మే 13 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని పేరూరు సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

దుకాణ యజమానికి జరిమానా

బనగానపల్లె, మే 13: పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నప్పటికీ పలువురు దుకాణ యజమానులు యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని గోల్డెన్ బేకరీ అండ్ స్వీట్ దుకాణం యజమానులు ప్లాస్టిక్ కవర్ల ద్వారా వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో దుకాణ యజమానికి రూ.5వేలు జరిమానా మంగళవారం గ్రామ పంచాయతీ ఈవో సతీశ్‌రెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది విధించారు. ఎవరైనా ప్లాస్టిక్ కవరు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈవో హెచ్చరించారు.

గరుడ వాహనంపై పాండురంగడు

కోవెలకుంట్ల, మే 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి గరుడ వాహనంపై పాండురంగస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. పాండురంగ విఠలేశ్వరస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ గుద్దేటి గుండయ్య అలియాస్ చిన్న వెంకటసుబ్బారెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి వేద పండితులు సంబటూరు వేణుగోపాలచారి, సంబటూరు సుదర్శనాచార్యులు పాండురంగడికి ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని గరుడ వాహనంపై ఎక్కించి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకువచ్చారు.

అవుకు: పట్టణంలోని కోటవీధిలో వెలసిన భూలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గరుడ వాహనంపై ఊరేగారు. ఉదయం అర్చకులు స్వామి వారిని అలంకరించి పూజలు చేశారు. కాసుల మహానందమ్మ పేరుతో జరుపబడే బ్రాహ్మణ సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రికి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై వీధుల్లో ఊరేగించారు.

గాలివాన బీభత్సం

- రోడ్డుకు అడ్డంగా పడ్డ వృక్షాలు
- రాకపోకలకు అంతరాయం



చిన్నకంబలూరు మెట్ట సమీపంలో రహదారికి అడ్డంగా పడ్డ చెట్లు

రుద్రవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో గాలివాన బీభత్సం సృష్టించింది. మండలంలోని చిన్నకంబలూరు మెట్ట సమీపంలో ఆర్అండ్‌బి రహదారికి అడ్డంగా వృక్షాలు పడ్డాయి. రుద్రవరం, నంద్యాల ఆర్టీసీ సర్వీసులు నిలిచాయి. రాకపోకలు స్తంభించాయి. ప్రయాణికులు మంగళవారం ఉదయం ఇబ్బందులు పడ్డారు. రహదారికి అడ్డంగా చెట్లు పడ్డా అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. కోటకొండ, ఆలమూరు గ్రామాల సమీపంలో ఆరబెట్టిన మొక్కజొన్నలు తడిచిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

16 నుంచి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



ఎమ్మెల్యే కోట్లకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గ్రామస్థులు

డోన్ రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో ఈనెల 16వ తేదీ నుంచి 18 వరకు సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు జరగనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు హైదరాబాదులో ఉన్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి ఆయన నివాసంలో విగ్రహ ప్రతిష్ఠకు హాజరు కావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీలం భాస్కర్ నాయుడు, టీడీపీ మండల కార్యదర్శి వెంకటనాయునిపల్లె శ్రీనివాసులు యాదవ్, గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

రసాయనాలతో మాగిస్తే చర్యలు

ఆళ్ళగడ్డ, మే 13 (ఆంధ్రజ్యోతి): కార్బైడ్ రసాయనం వాడి పండ్లను మాగిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రతా శాఖ అధికారి వెంకటరాముడు హెచ్చరించారు. మంగళవారం ఆళ్లగడ్డలోని ఎంఏఎస్ ఫ్రూట్ గోదాం ఆవరణలో మండ్ల వ్యాపారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసా యనం వాడకాన్ని 2013లో కేంద్రప్రభుత్వం నిషేధించిందన్నారు. కార్యక్రమంలో ఆహార భద్రతా శాఖా అధికారి కాసింవలి, మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, మార్కెటింగ్ శాఖ సూపర్‌వైజర్, ఎంఏఎస్ గోడౌన్ యజమాని ఫకురుద్దీన్, వ్యాపారులు పాల్గొన్నారు.

డ్రైవర్ల డిమాండ్లను పరిష్కరించాలి

ప్యాపిలి, మే 13 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ల డిమాండ్లను పరిష్కరించాలని సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు అన్వర్ బాషా ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మంగళవారం పట్టణంలో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్వర్‌బాషా మాట్లాడుతూ డ్రైవర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని, రూ.20లక్షలు జీవిత బీమా కల్పించాలని, 50ఏళ్లు నిండిన ప్రతి డ్రైవర్‌కు ప్రతినెల రూ.10వేలు పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు రామకృష్ణయాదవ్, బాషా, కిషోర్‌కుమార్, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

బేతంచెర్ల, మే 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని అగ్రికల్చర్ అసిస్టెంట్ భారతి రైతులకు సూచించారు. మంగళవారం ఆర్ఎస్ రంగాపురం, కొమ్మూరు కొట్టాల గ్రామంలోని రైతు నారాయణ పొలంలో వీఏఏ భారతి భూసార పరీక్షలు జరిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు భూసార పరీక్ష చేయించుకుంటే నేలసారాన్ని తెలుసుకోవడం, ఎరువుల వినియోగాన్ని మెరుగుపరచడం, పంట ఎంపికలో సహాయం, నేల సంరక్షణ తదితర ఉపయోగాలు కలుగుతాయన్నారు.

వాటర్‌మన్ మృతి

కొలిమిగుండ్ల, మే 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మీర్జాపురం గ్రామంలో సుదర్ఘీకాలంగా వాటర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న మార్కె దస్తగిరి(48) అనారోగ్యంతో మృతి చెందారు. దస్తగిరి వాటర్‌మెన్‌తోపాటు గ్రామ పంచాయతీ వార్డుమెంబర్‌గా కూడా ఎన్నికయ్యారు.